ప్రజాశక్తి
మంగళవారం 18 నవంబర్ 2025
8 పేజీలు

విశాఖపట్నం

అనకాపల్లి

గ్రంథాలయాలకు నిధుల లేమి

భీమిలి గ్రంథాలయంలో పత్రికలు చదువుతున్న పాఠకులు

- ఉమ్మడి విశాఖ జిల్లాలో లైబ్రరీ సెస్సు బకాయి రూ.200 కోట్లు
- కష్టతరంగా నిర్వహణ
- ఉద్యోగులకు సక్రమంగా జీతాలు అందని వైనం
- సమస్యలపై దృష్టి సారించని ప్రభుత్వం

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్

ఉమ్మడి విశాఖ జిల్లాలో ప్రభుత్వ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న గ్రంథాలయాల పరిస్థితి దీనంగా ఉంది. నిధుల లేమితో వీటి నిర్వహణ కష్టంగా మారింది. వీటిలో పనిచేస్తున్న ఉద్యోగులకు జీతాలు సక్రమంగా అందని పరిస్థితి నెలకొంది. రిటైర్ అయిన ఉద్యోగ ఖాళీలను భర్తీ చేయడం లేదు. అయితే పాఠకుల కోరిక మేరకు కొత్త గ్రంథాలను సమకూరుస్తున్నామని గ్రంథాలయ శాఖ అధికారులు మాత్రం చెబుతున్నారు. కేవలం దినపత్రికలకు మాత్రమే సరిపడే డబ్బు మాత్రమే ఇస్తూ ప్రభుత్వం మమ అనిపిస్తోందని పలువురు విమర్శిస్తున్నారు.

గ్రంథాలయాలకు స్థానిక సంస్థల నుంచి రావలసిన సెస్సు సొమ్మును చాలాకాలంగా చెల్లించక పోవడంతో సమస్యలు ముసురు కుంటున్నాయి. ఉమ్మడి విశాఖ జిల్లాలో సెస్సు బకాయి సొమ్ము సుమారు రూ.200 కోట్లు ఉంది. అందులో గ్రేటర్ విశాఖ మున్సిపల్ కార్పొరేషన్ (జివిఎంసి) గ్రంథాలయ సంస్థకు బకాయి పడ్డ సెస్సు సొమ్ము రూ.148 కోట్లు. నర్సీపట్నం, యలమంచిలి మున్సిపాలిటీలతో పాటు ఉమ్మడి విశాఖ జిల్లాలోని గ్రామ పంచాయతీల నుంచి రావలసిన బకాయిలు సుమారు రూ.50 కోట్లు వరకూ ఉన్నట్టు సమాచారం. స్థానిక సంస్థలు ప్రతి ఏటా వసూలు చేసే ఇళ్ల పన్నుల నుంచి 8 శాతం సొమ్మును గ్రంథాలయ సెస్సు పేరుతో ఇవ్వాలి. ఇళ్ల పన్నులను వసూలు చేస్తున్న స్థానిక సంస్థలు అందులోని గ్రంథాలయాలకు చెల్లించవలసిన సెస్సు సొమ్మును మాత్రం చెల్లించడం లేదు. మొత్తం సొమ్ము స్థానిక సంస్థల వద్దనే ఉంటోంది. దీనిపై అడిగేవారు, ప్రశ్నించేవారు కరువయ్యారు. రాష్ట్రంలో ఏ ప్రభుత్వం ఉన్నప్పటికీ గ్రంథాలయాల సెస్సు బకాయిలు చెల్లించే ఏర్పాట్లు చేయటం లేదు. పాలకుల నిర్లక్ష్యం గ్రంథాలయాలకు గ్రహపాటుగా మారింది.

ఉమ్మడి విశాఖ జిల్లాలో మొత్తం 67 గ్రంథాలయాలు ఉన్నాయి. వీటిలో ప్రథమ శ్రేణి గ్రంథాలయాలు 8, ద్వితీయ శ్రేణి గ్రంథాలయాలు 2, తృతీయ శ్రేణి గ్రంథాలయాలు 51 ఉన్నాయి. ఇవి కాకుండా పలు గ్రామాలలో బుక్ డిపో సెంటర్లు ఉన్నాయి.

అద్దె భవనాలలో గ్రంథాలయాలు

ఉమ్మడి జిల్లాలో ప్రభుత్వ గ్రంథాలయాలకు సొంత భవనాలు కొన్నింటికి మాత్రమే ఉన్నాయి. కొన్నిచోట్ల అద్దె భవనాల్లో కొనసాగుతున్నాయి. ఉమ్మడి మిగతా 2లో..

సరుకు రవాణాలో వాల్తేరు డివిజన్ రికార్డు

230 రోజుల్లో 50 మిలియన్ టన్నులతో అత్యుత్తమ పనితీరు

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : ఈస్ట్ కోస్ట్ రైల్వేలోని వాల్తేరు డివిజన్ సరుకు రవాణాలో రికార్డు నెలకొల్పింది. ఆర్థిక సంవత్సరంలో నవంబర్ 16 నాటికి 230 రోజుల్లోనే 50 మిలియన్ టన్నుల సరుకును రవాణా చేసి డివిజన్ చరిత్రలోనే అత్యుత్తమ పనితీరును నమోదు చేసింది. గత ఆర్థిక సంవత్సరంతో పోలిస్తే ఇది 12.5 శాతం వృద్ధిని సూచిస్తోంది. ఈ అద్భుతమైన పనితీరుతో వాల్తేరు డివిజన్ భారతీయ రైల్వేలన్నింటిలోనూ టాప్-5 అత్యుత్తమ డివిజన్లలో స్థానం సంపాదించింది. గత సంవత్సరం ఆరో స్థానంలో ఉన్న డివిజన్ ఈసారి ఒక స్థానం మెరుగుపరుచుకోవడం విశేషం. 50 మిలియన్ టన్నుల సరుకు రవాణా లక్ష్యాన్ని చేరుకోవడానికి 2023-24 కాలంలో 256 రోజులు పట్టింది. తాజా రికార్డు దీని కంటే 26 రోజుల ముందుగానే సాధించబడింది. దీనికి అదనంగా అక్టోబర్ 2025లో ఈ డివిజన్ 7.10 మెట్రిక్ టన్నుల సరుకు రవాణా చేసి అన్ని గత నెలవారీ రికార్డులను అధిగమించి ఆల్‌టైమ్ హై నెలవారీ లోడింగ్‌ను నమోదు చేసింది.

కారణాలేంటి ?

ట్రాఫిక్ సౌకర్యాలను మెరుగు పరచడం, ర్యాక్ లభ్యతను నిర్ధారించడం, వినియోగదారులకు సకాలంలో ర్యాక్ కేటాయింపులు చేయడం వంటి నిరంతర ప్రయత్నాలు ఈ వృద్ధికి ప్రధాన కారణాలని అధికారులు తెలిపారు. విశాఖ పోర్ట్, గంగవరం పోర్ట్, స్టీల్‌ప్లాంట్, హెచ్‌పిసిఎల్, ఉత్కల్ అల్యూమినా, ఎన్ఎండిసి వంటి ముఖ్యమైన లోడింగ్ పాయింట్ల నుండి సరుకు రవాణా పెరగడం ఈ రికార్డుకు సాధ్యమైంది. ఈ చారిత్రక మైలురాయిని సాధించినందుకు డివిజనల్ రైల్వే మేనేజర్ లలిత్ బోహ్రా ట్రాఫిక్ విభాగాన్ని అభినందించారు. అలాగే ఐదో స్థానం దక్కించుకోవడంలో పాలుపంచుకున్న అన్ని అనుబంధ విభాగాల వారిని మెచ్చుకున్నారు.

బల్క్ డ్రగ్ పార్క్ రద్దుకు పోరాటం
వార్త 8లో..

కనీస పెన్షన్ రూ.9 వేలు చేయాలి
వార్త 4లో..

రుణాల గోల్‌మాల్‌పై నిరసన
వార్త 7లో..

పిజిఆర్ఎస్‌కు వినతుల వెల్లువ

వినతులు స్వీకరిస్తున్న కలెక్టర్ హరేంధిర ప్రసాద్

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : పిజిఆర్ఎస్ వేదికగా ప్రజల నుంచి అందే ఫిర్యాదుల పరిష్కారంలో అధికారులు ప్రత్యేక చొరవ చూపాలని జిల్లా కలెక్టర్ ఎంఎన్.హరేంధిర ప్రసాద్ సూచించారు. వచ్చిన దరఖాస్తుకు మొక్కుబడిగా సమాధానం ఇచ్చి సరిపెట్టకుండా సమస్య స్థితిగతులను తెలియజేయాలని పేర్కొన్నారు. ప్రతి ఫిర్యాదుదారుడికీ తగిన విధంగా ఎండార్స్మెంట్ ఇవ్వాలని, సంబంధిత విభాగాధిపతి నేరుగా ఫోన్ చేసి మాట్లాడాలని చెప్పారు. సోమవారం జరిగిన పిజిఆర్ఎస్‌లో వివిధ సమస్యలకు సంబంధించిన అంశాలపై 382 వినతులు అందాయి. వాటిలో రెవెన్యూ 140, జివిఎంసికి సంబంధించినవి 98, పోలీస్ విభాగానికి చెందినవి 38, ఇతర విభాగాలకు చెందినవి 106 ఉన్నాయి. కలెక్టర్, జెసిలతో పాటు డిప్యూటీ కలెక్టర్ సత్తిబాబు, ఎసిపి ధనుంజయ రెడ్డి ప్రజల నుంచి వినతులు స్వీకరించారు.

జివిఎంసిలో..

ఎంవిపి.కాలనీ : రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న 'ప్రజా సమస్యల పరిష్కార వేదిక' కార్యక్రమంలో జివిఎంసిలో అన్ని విభాగాలకు కలిపి 102 వినతులు వచ్చాయని కమిషనర్ కేతన్ గార్గ్ పేర్కొన్నారు. సోమవారం ఆయన జివిఎంసి ప్రధాన కార్యాలయంలోని పాత సమావేశ మందిరంలో జివిఎంసి అదనపు కమిషనర్లు డివి.రమణమూర్తి, ఎస్ఎస్.వర్మలతో కలిసి ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమాన్ని నిర్వహించారు.

బంగ్లాదేశ్ వ్యక్తి అరెస్టు

ప్రజాశక్తి - అనకాపల్లి రూరల్ : ఎలాంటి పాస్ పోర్ట్, వీసా లేకుండా అనకాపల్లి రైల్వే స్టేషన్‌లో ఉన్న బంగ్లాదేశ్ వ్యక్తిని పోలీసులు అరెస్ట్ చేసి రిమాండ్‌కు పంపారు. సిఐ ప్రేమ్ కుమార్ కథనం మేరకు.. రైల్వే స్టేషన్ వద్ద అనుమానాస్పదంగా ఉన్న బంగ్లాదేశ్ వ్యక్తి విక్రమ్ అలీని, ఓ బాలికను ఇటీవల అదుపులోకి తీసుకున్నారు. విచారించగా అలీ 2012లోనే ఇండియాలోకి చొరబడి ఉత్తరప్రదేశ్ ఆలిగఢ్‌లో పదేళ్ల ఉన్నట్టు చెప్పాడు. తర్వాత ఆంధ్రప్రదేశ్‌లోని కానినాడలో ఉన్నట్లు తెలిపాడు. పోలీసులు విచారణ కొనసాగించగా బంగ్లాదేశ్‌కు చెందిన మైనర్ బాలికలకు వివాహం చేస్తానంటూ బోర్డర్ దాటించి తన ఇంటిలో అక్రమంగా బంధించినట్టు తేలింది.

21న పిటిషన్ల కమిటీ పర్యటన

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : పిటిషన్లపై శాసన సభ కమిటీ సమావేశం శుక్రవారం జిల్లా కలెక్టరేట్‌లో ఉంటుందని శాసన సభ సెక్రటరీ జనరల్ ప్రసన్న కుమార్ సూర్యదేవర ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సమావేశంలో చిత్తూరు శాసనసభ్యులు గురజాల జగన్ మోహన్ కమిటీకి సమర్పించిన సమగ్ర భూసర్వే పిటిషన్‌పై చర్చ జరుగనుందని పేర్కొన్నారు.

ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులుగా

అజయ్, వెంకటరమణ

అజయ్

వెంకట రమణ

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : ఎస్ఎఫ్ఐ విశాఖ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులుగా జి.అజయ్, డి.వెంకటరమణ ఎన్నికయ్యారు. సంఘం జిల్లా 37వ మహాసభ అల్లూరి సీతారామరాజు విజ్ఞాన కేంద్రంలో ఆదివారం జరిగింది. జిల్లాలోని విద్యార్థులు ఎదుర్కొంటున్న సమస్యలపై సుదీర్ఘంగా చర్చించారు. భవిష్యత్తు కర్తవ్యాలు నిర్దేశించుకున్నారు. అనంతరం నూతన జిల్లా కమిటీని ఎన్నుకున్నారు. నూతన అధ్యక్ష, కార్యదర్శులుగా జి.అజయ్, డి.వెంకటరమణ, ఉపాధ్యక్షులుగా జి.పల్లవి, పి.సాయితేజ, ఎం.కౌశిక్, సహాయ కార్యదర్శులుగా ఎం.నరేష్, టి.మౌనిక, ఎం.కుసుమాంజలితో పాటు 21 మంది జిల్లా కమిటీ సభ్యులుగా ఎన్నికయ్యారు. మహాసభకు ముఖ్య అతిథిగా హాజరైన సంఘం రాష్ట్ర అధ్యక్షులు పి.రామ్మోహన్ మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా విద్యార్థులందరూ అనేక సమస్యలతో ఇబ్బంది పడుతుంటే ప్రభుత్వం, అధికారులు, ముఖ్యంగా విద్యా శాఖ మంత్రి నారా లోకేష్ పట్టించుకోవడం లేదన్నారు. సంక్షేమ హాస్టళ్ల విద్యార్థుల మరణాలు పెరుగుతుండటంపై ఆందోళన వ్యక్తం చేశారు. అక్కడి విద్యార్థులకు వైద్యం అందుబాటులో లేకపోవడం దౌర్భాగ్యమన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా రూ.6800 కోట్ల రూపాయల ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు విడుదల చేయకుండా లక్షల మంది విద్యార్థులపై ఫీజుల భారాన్ని మోపుతున్నారన్నారు. గత ప్రభుత్వం వ్యవహరించిన రీతిలోనే విద్యార్థి పోరాటాలపై పోలీసులతో కూటమి సర్కారు నిర్బంధాన్ని ప్రయోగిస్తోందన్నారు.

మొదటి పేజీ తరువాయి..

గ్రంథాలయాలకు నిధుల లేమి

జిల్లాలో గ్రంథాలయ వ్యవస్థ నడపడం కోసం విశాఖపట్నం కేంద్రంగా జిల్లా గ్రంథాలయ సంస్థ ఉంది. మహారాణి పేటలో చాలాకాలం జిల్లా గ్రంథాలయ సంస్థ, అదే చోట జిల్లా గ్రంథాలయం నడిచేవి. అక్కడ ఉన్న గ్రంథాలయ సంస్థకు చెందిన సుమారు ఎకరా భూమిని ఒక ప్రైవేటు సంస్థకు అప్పగించే ఏర్పాట్లు నాడు చేశారు. ఆ సంస్థ ఇక్కడ ఉన్న గ్రంథాలయాన్ని తొలగించింది. స్థలాన్ని స్వాధీనం చేసుకుంది. ఈ స్థలంలో బహుళ అంతస్తుల షాపింగ్ కాంప్లెక్స్ నిర్మించాలని, అందులో రెండింటిని గ్రంథాలయ సంస్థకు, జిల్లా గ్రంథాలయానికి ఇచ్చేందుకు అంగీకరించి, స్థలాన్ని తీసుకుంది. ఈ నేపథ్యంలో జిల్లా గ్రంథాలయ సంస్థ కార్యాలయాన్ని ద్వారకా నగర్ ప్రాంతానికి, జిల్లా గ్రంథాలయాన్ని చిత్రాలయ థియేటర్ ఎదురుగా ఉన్న రోడ్డులోకి మార్చారు. దాదాపు 15 ఏళ్లుగా అవి రెండు అద్దె భవనాల్లోనే కొనసాగుతున్నాయి. వీటి కోసం గ్రంథాలయ సంస్థ ప్రతి నెలా అద్దె రూపంలో రూ.40 వేలు చెల్లిస్తోంది. జిల్లా గ్రంథాలయ సంస్థ స్థలాన్ని ప్రైవేటు వ్యక్తులకు ఇవ్వడాన్ని నిరసిస్తూ పలు ప్రజా సంఘాలు ఆందోళన కార్యక్రమాలను నిర్వహించాయి. ఈ నేపథ్యంలో ప్రభుత్వం ఆ స్థలాన్ని తిరిగి స్వాధీనం చేసుకుంది. తదుపరి స్థలంలో జిల్లా గ్రంథాలయ భవనాన్ని నిర్మించాలని అనుకున్నారు. గత ప్రభుత్వంలో ఉన్నప్పుడు రూ. 20 కోట్లతో ఇక్కడ భవనం నిర్మించాలని ప్రయత్నించారు. అందులో భాగంగా రూ.2 కోట్లు ప్రభుత్వానికి భవన నిర్మాణం కోసం ముందుగా జిల్లా గ్రంథాలయ సంస్థ నుంచి చెల్లించారు. ఇంత జరిగినా, అక్కడ భవన నిర్మాణం మాత్రం చేపట్టలేదు.

ఇదిలా ఉండగా రాష్ట్ర గ్రంథాలయ సంస్థ చైర్మన్ గోనుకుంట్ల కోటేశ్వరరావు ఈ ఏడాది మే 8న విశాఖపట్నం వచ్చారు. ఆ సమయంలో జిల్లా గ్రంథాలయ సంస్థకు జివిఎంసి బకాయి ఉన్న సుమారు రూ.150 కోట్లు చెల్లించాలని, అప్పటి జివిఎంసి ఇన్‌ఛార్జి కమిషనర్, జిల్లా కలెక్టర్ ఎంఎన్.హరేంధిర ప్రసాద్‌ను కోరారు. అయితే మొత్తం బకాయి సొమ్ము ఒకేసారి చెల్లించడం సాధ్యం కాదని, దఫదఫాలుగా చెల్లిస్తామని కలెక్టర్ తెలిపారు. ఇది జరిగి దాదాపు ఆరు మాసాలు కావస్తున్నా గ్రంథాలయ సెస్సు బకాయి సొమ్ము చెల్లించలేదు. ప్రస్తుత కమిషనర్‌గా ఉన్న కేతన్ గార్గ్ ఈ అంశంపై దృష్టిసారించాలని పలువురు కోరుతున్నారు.

మత్స్యకారులను విడిపించాలి

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : గత నెల 13న బంగ్లాదేశ్ జలాల్లోకి పొరపాటున వెళ్లి అక్కడి జైల్లో బందీలుగా ఉన్న విశాఖ మత్స్యకారులను విడిపించాలని మత్స్యకారులు, మత్స్యకార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షులు కె.చంద్రశేఖర్ డిమాండ్ చేశారు. బాధిత కుటుంబాలతో కలిసి సోమవారం కలెక్టరేట్ ఆవరణలో ఆయన నిరసన తెలిపారు. కలెక్టర్‌ను కలిసి వినతిపత్రం సమర్పించారు. బంగ్లాదేశ్‌లో చిక్కుకున్న మత్స్యకారులను విడిపించడానికి కూటమి ప్రభుత్వం నాయకులు సంఘటన జరిగిన మరుసటి రోజున విశాఖ ఫిషింగ్ హార్బర్‌లో యజమానుల సంఘ కార్యాలయంలో సమావేశం ఏర్పాటు చేసి అన్ని విధాల ఆదుకుంటామని భరోసా ఇచ్చారన్నారు. నెలరోజులు కావస్తున్నా ఎవరూ మత్స్యకారులను పరామర్శించడానికి వెళ్లలేదన్నారు. ఏ ఒక్క అధికారీ బాధితుల ఇంటికి రాలేదని, ఆర్థికంగా సహాయం కూడా చేయలేదని అన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ సూరాడ చిన్నారావు, వంక గురుమూర్తి, బంగ్లాదేశ్‌లో చిక్కుకున్న బాధితుల కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

సీనియర్ సిటిజన్ల హక్కులపై అవగాహన

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : సీనియర్ సిటిజన్లకు లభించే హక్కులు, పిల్లల బాధ్యతలు, నెలవారీ నిర్వహణ భత్యం కోసం దరఖాస్తు విధానం తదితర అంశాలపై అవగాహనా కార్యక్రమం సోమవారం ప్రేమ సమాజం వృద్ధాశ్రమంలో జరిగింది. జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి ఆర్.సన్యాసినాయుడు మాట్లాడుతూ పలు అంశాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమాల్లో వికలాంగుల సంక్షేమ శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ కె.కవిత, స్టేట్ గవర్నమెంట్ పెన్షనర్ల అసోసియేషన్ అధ్యక్షులు ప్రసాదరావు పాల్గొన్నారు.

కేసుల పట్ల నిర్లక్ష్యం తగదు

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : నగర పరిధిలోని వన్ టౌన్ పోలీస్ స్టేషన్‌లో నమోదైన 164/25, 152/25 కేసుల పట్ల పోలీసులు అలసత్వం ప్రదర్శించడం సరికాదని, ఇప్పటికైనా ఆ కేసులను సత్వరమే పరిష్కరించి బాధితులకు న్యాయం జరిగేలా చూడాలని మత్స్యకారులు, మత్స్యకార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షులు కె.చంద్రశేఖర్ డిమాండ్ చేశారు. సోమవారం కలెక్టరేట్ ఎదుట బాధితులతో కలిసి నిరసన తెలిపారు. ప్రజా సమస్యల పరిష్కార వేదికలో వినతి పత్రాలు సమర్పించారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ హత్య చేసి పరారీలో ఉన్న నిందితులను తీసుకురావడంలో పోలీసులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారన్నారు. ఇది ఎంత మాత్రమూ తగదన్నారు. కార్యక్రమంలో సిఐటియు సీనియర్ నాయకులు వై.రాజు, సర్పంచ్ సూరాడ చిన్నారావు, రాగతి అమ్మోరు, ధనరాజు, గనగల అప్పన్న, ఎల్లయమ్మ, దానయ్యమ్మ, రాజు, ధన పాల్గొన్నారు.

అకాల శిశువులకు సంరక్షణ అవసరం

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : నెలలు నిండకుండానే జన్మించిన (ప్రీమెచ్యూర్) శిశువులపై అవగాహన కల్పించేందుకు విశాఖపట్నంలోని మెడికవర్ ఉమెన్ అండ్ చైల్డ్ హాస్పిటల్స్ ఘనంగా కార్యక్రమాలు నిర్వహించాయి. ఉదయం బీచ్ రోడ్డులో నిర్వహించిన 2కె వాకథాన్‌ను ముఖ్య అతిథి విశాఖపట్నం కమిషనర్ ఆఫ్ పోలీస్ శంఖబ్రత బాగ్చి జెండా ఊపి ప్రారంభించారు.

ఎయులో బ్యాక్‌లాగ్ పోస్టులపై న్యాయ విచారణ జరపాలి

ప్రజాశక్తి -విశాఖ కలెక్టరేట్ : ఆంధ్రా యూనివర్సిటీలో బ్యాక్‌లాగ్ పోస్టుల భర్తీలో పలు అక్రమాలు జరిగాయని ఈ నియామకాలపై వెంటనే న్యాయవిచారణ చేపట్టాలని దళిత సంఘాల ఐక్యవేదిక (విదసం) రాష్ట్ర కన్వీనర్ డాక్టర్ బూసి వెంకటరావు డిమాండ్ చేశారు. సోమవారం కలెక్టరేట్ ఎదుట నిరసన తెలిపారు. ప్రజాసమస్యల పరిష్కార వేదికలో కలెక్టర్‌కు వినతిపత్రం అందించారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ, ఆంధ్రా యూనివర్సిటీలో 2018 నుండి భర్తీ కాకుండా 33 ఎస్సి, ఎస్టి క్లాస్ 4 ఉద్యోగాల నియామకాలు పెండింగ్‌లో ఉన్నాయని, వీటిపై 2021లో నోటిఫికేషన్ జారీ చేశారని, ఆ సమయంలో 30 పోస్టులకు వేల మంది దరఖాస్తు చేసుకున్నారన్నారు. ప్రస్తుతం ఉన్న వైస్‌ఛాన్సలర్, పాతనోటిఫికేషన్‌పై కార్యాచరణ చేపట్టి, కొత్త నోటిఫికేషన్ ఇవ్వలేదన్నారు. ఏడు సంవత్సరాలుగా పెండింగ్‌లో ఉన్న బ్యాక్‌లాగ్ పోస్టులను బ్యాక్‌డోర్‌లో విక్రయించారని ఆరోపించారు.

ఈ పోస్టుల భర్తీ ప్రక్రియపై సిట్టింగ్ న్యాయమూర్తితో విచారణ చేయాలన్నారు. ఎయు విసి వెంటనే ఈ నియమక ప్రక్రియ రద్దు చేసి జరిగిన తప్పును సరిదిద్దుకోవాలన్నారు. కార్యక్రమంలో బూల భాస్కరరావు, గుడివాడ ప్రసాద్, డి.నిర్మల, గోరా గోపి, సిహెచ్‌దాలయ్య, సింహాచలం, పైడిరాజు తదితరులు పాల్గొన్నారు.

సెక్యూరిటీ కాంట్రాక్టర్ మోసాలను అరికట్టాలి

ప్రజాశక్తి- విశాఖ కలెక్టరేట్ : కెజిహెచ్‌లో సెక్యూరిటీ కాంట్రాక్టర్ మోసాలను అరికట్టాలని విశాఖ జిల్లా ఆసుపత్రులు నర్సింగ్‌హోమ్స్ ప్రధాన కార్యదర్శి కర్రి చంద్రశేఖరం, సిఐటియు సీనియర్ నాయకులు వై.రాజు డిమాండ్ చేశారు. సోమవారం ప్రజాసమస్యల పరిష్కార వేదికలో ఈ మేరకు జిల్లా కలెక్టర్‌కు వినతిపత్రం అందించారు. అనంతరం వారు మీడియాతో మాట్లాడుతూ, జివో ప్రకారం రూ.18,600 వేతనం చెల్లించాల్సి ఉండగా రూ.12 వేలు మాత్రమే చెల్లించి మిగతా రూ.6 వేలు కెజిహెచ్ అధికారుల అండదండలతో కాంట్రాక్టర్లు తన జేబులో వేసుకుంటున్నారన్నారు. ఈ విషయమై అనేకసార్లు కెజిహెచ్ అధికారులకు, కలెక్టర్‌కి ఫిర్యాదు చేసినా పరిష్కారం కాలేదన్నారు. సమస్యలను అధికారులు దృష్టికి తీసుకెళుతున్నామనే కక్షతో ఉద్యోగాలు తీసేస్తామని కాంట్రాక్టర్ బెదిరిస్తున్నారన్నారు. కెజిహెచ్ అడ్మినిస్ట్రేషన్ ఆఫీసర్‌ను కలిసి సమస్య చెప్తే మీ దగ్గర ఆధారాలు ఉన్నాయా అని బెదిరించే విధంగా మాట్లాడుతున్నారని ఆరోపించారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి కేజీహెచ్ ఆసుపత్రి చైర్మన్ అయిన జిల్లా కలెక్టర్, జోక్యం చేసుకొని కాంట్రాక్టర్ చేస్తున్న అన్యాయాలను అక్రమాలను కట్టడి చేయాలని డిమాండ్ చేశారు.

22న అంతర్రాష్ట్ర మోటార్ సైకిల్ యాత్ర

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : యూత్ హాస్టల్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా విశాఖ జిల్లా శాఖ స్వర్ణోత్సవాల సందర్భంగా అంతర్ రాష్ట్ర మోటార్‌సైకిల్ యాత్రను ప్రకటించింది. ఈ నెల 22, 23న ఆంధ్ర, ఒడిశా రాష్ట్రాల్లో ఈ యాత్ర నిర్వహిస్తున్నట్లు యూత్ హాస్టల్స్ విశాఖ జిల్లా శాఖ చైర్మన్ మహమ్మద్ మజహార్ ఇబ్రహీం మీడియాకు సోమవారం తెలిపారు.

పత్రిక ప్రకటన

ఫారం నెం. ఐ.ఎన్.సి-26

సెంట్రల్ గవర్నమెంట్, కార్పొరేట్ వ్యవహారాల మంత్రిత్వ శాఖ, ప్రాంతీయ డైరెక్టర్, సౌత్ ఈస్ట్ రీజియన్, హైదరాబాద్ సమక్షంలో కంపెనీల చట్టం, 2013 లోని సెక్షన్ 13 యొక్క సబ్-సెక్షన్ (4) మరియు కంపెనీలు (ఇన్‌కార్పొరేషన్) రూల్స్, 2014 లోని రూల్ 30 యొక్క సబ్-రూల్ (5) లోని క్లాజ్ (ఎ) విషయంలో

మరియు

మెడ్‌నెక్ట్స్ హెల్త్‌కేర్ ప్రైవేట్ లిమిటెడ్ (CIN: U85110AP2011PTC075761) దాని రిజిస్టర్డ్ ఆఫీస్‌ను డోర్ నెం. 54-15-4, ఫ్లాట్ నెం.502 శ్రీ నిలయం, సీతమ్మధార, విశాఖపట్నం, ఆంధ్రప్రదేశ్, భారతదేశం, 530013

... పిటిషనర్/దరఖాస్తుదారు.

సాధారణ ప్రజలకు ఈ నోటీసు ద్వారా తెలియజేయడమేమంటే, కంపెనీ తన రిజిస్టర్డ్ కార్యాలయాన్ని "ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం" నుండి "తెలంగాణ రాష్ట్రానికి" మార్చడానికి వీలుగా, కంపెనీల చట్టం, 2013 లోని సెక్షన్ 13 ప్రకారం మెమోరాండం ఆఫ్ అసోసియేషన్ (MOA) మార్పును ధృవీకరించడానికి సెంట్రల్ గవర్నమెంట్‌కు దరఖాస్తు చేసుకోవాలని ప్రతిపాదిస్తోంది. ఈ మార్పు అక్టోబర్ 14, 2025 న జరిగిన అసాధారణ సర్వసభ్య సమావేశంలో ఆమోదించబడిన ప్రత్యేక తీర్మానం ప్రకారం జరుగుతుంది.

కంపెనీ రిజిస్టర్డ్ కార్యాలయం యొక్క ప్రతిపాదిత మార్పు ద్వారా ఎవరి ప్రయోజనం అయితే ప్రభావితం అయ్యే అవకాశం ఉందో, ఆ వ్యక్తి ఈ నోటీసు ప్రచురించబడిన తేదీ నుండి పద్నాలుగు (14) రోజులలోపు తన అభ్యంతరాలను, తన ఆసక్తి యొక్క స్వభావం మరియు వ్యతిరేకతకు గల కారణాలను పేర్కొంటూ అఫిడవిట్‌తో, ఎంసీఏ-21 పోర్టల్ (www.mca.gov.in) లో పెట్టుబడిదారుల ఫిర్యాదు ఫారం దాఖలు చేయడం ద్వారా గానీ లేదా రిజిస్టర్డ్ పోస్ట్ ద్వారా ప్రాంతీయ డైరెక్టర్, కార్పొరేట్ వ్యవహారాల మంత్రిత్వ శాఖ, సౌత్ ఈస్ట్ రీజియన్, 3వ ఫ్లోర్, కార్పొరేట్ భవన్, బండ్లగూడ, నాగోల్, తట్టి అన్నారం విలేజ్, హయత్ నగర్ మండలం, రంగారెడ్డి జిల్లా, హైదరాబాద్-500068, తెలంగాణ వారికి పంపవచ్చు. ఈ అభ్యంతరాల కాపీని కింద పేర్కొన్న రిజిస్టర్డ్ కార్యాలయం చిరునామాలో దరఖాస్తుదారు కంపెనీకి పంపాలి:

రిజిస్టర్డ్ కార్యాలయం: డోర్ నెం. 54-15-4, ఫ్లాట్‌నెం. 502, శ్రీ నిలయం, సీతమ్మధార, విశాఖపట్నం-530013, ఆంధ్రప్రదేశ్, భారతదేశం

స్థలం : విశాఖపట్నం
తేది : 18-11-2025

దరఖాస్తుదారు తరపున మరియు వారి కోసం
మెడ్‌నెక్ట్స్ హెల్త్‌కేర్ ప్రైవేట్ లిమిటెడ్
సం/- **లక్ష్మీ కళ్యాణి చెరుకూరి**
డైరెక్టర్
DIN: 06964973

మహారాజశ్రీ అనకాపల్లి ప్రధాన జూనియర్ సివిల్ జడ్జి వారి కోర్టులో
O.S 166/2014

బిట్వీన్
పడాల అప్పారావుల ...**వాది.**
అండ్
చింతా రామమూర్తి వగైరాలు
...**ప్రతివాదులు.**

దావాసమును

టు,
5వ ప్రతివాదికి
కనుపూరి రమణమ్మ, వరాహపురం గ్రామం, చోడవరం మండలం, అనకాపల్లి జిల్లా.

పై నెంబర్ దావా షెడ్యూల్ ఆస్తి వాది అనుభవించుటలో మీరు గాని, మీ తరుపు మనుషులు గాని ఎటువంటి ఆటంకము కలుగజేయకుండా పర్మినెంట్ ఇంజక్షన్ ఇప్పించమని కోరుతూ పై నెంబర్ దావా దాఖలు చేసి ఉన్నారు. కావున **24-11-2025వ తేదీ ఉదయం10:30 నిమిషములకు** మీరు స్వయంగ గాని లేక మీ తరఫున లాయర్ గారు గానీ పై కోర్టులో హాజరై మీకు గల అభ్యంతరములను తెలుపుకొనవలెను. లేనిచో మీ పరోక్షమందు పై దావా తీర్మానించబడును ఇందుమూలముగా మీకు తెలియజేయడమైనది.

S.D.జగన్నాథరాజు, Y. నూక రాము
వాది తరపు అడ్వకేట్స్,
అనకాపల్లి.

IN THE HONOURABLE COURT OF THE VI ADDITIONAL CIVIL JUDGE (SENIOR DIVISION) AT VISAKHAPATNAM
E. A NO:102/2025 IN E.P NO: 4/2025

Between:
Polimerla Padmavathi
...DHR/PLAINTIFF
AND:
Kaki Anand
...JDR/3rd RESPONDENT

NOTICE

To,
3. Kaki Anand, S/o Somulu Aged 33 Years, Residing at D.No 3-8/3, Dey mette, Shipyard Layout, Kommadi Village , Visakhapatnam.
...Respondent -3/ J.D.R -3

Smt.Polimerla Padmavathi filed the above E.A NO:102/2025 IN E.P NO:4/2025 against J.d.r- 3/ Respondent -3 and it was posted to **03-12-2025** for your appearance. Therefore you are here by directed by the HON'BLE VI ADDITIONAL CIVIL JUDGE(SENIOR DIVISION) AT VISAKHAPATNAM to appear on the above court in person or through your advocate on **03-12-2025 at 10.30 AM.** If you failed to appear on that day, the case will be heard and determined in your absence.

TALLURI RAVI KUMAR, ADVOCATE,
30-7-17, Ranga Street, Visakhapatnam,
Mobile: 9848722288

DATE: 17-11-2025
VISAKHAPATNAM.

IN THE HONOURABLE COURT OF THE 3rd ADDL.CIVIL JUDGE (JUNIOR DIVISION) AT VISAKHAPATNAM
O.S. NO.990/2025

Between:
Karni Madhu Kiran . . . Plaintiff
And:
1) Srirangam Deepak Kumar
2) Srirangam Venkata Joga Rao
... Defendants

To
1) Srirangam Deepak Kumar, S/o. S. Venkata Joga Rao, Hindu, Aged 35 years, residing at D.No.5-156/6, Flat No. F-3, First Floor, Sankar Nivas Apartment, Venkatadri Nagar, Sujatha Nagar, Pendurthy Mandal, Visakhapatnam-530 051
2) Srirangam Venkata Joga Rao, S/o. S. Venkata Rao, Hindu, aged 62 years, rest -do-

SUMMONS

Take Notice that the above plaintiff herein have filed a suit for recovery of Rs. 13,81,933/- (under the promissory note) and for other reliefs against both of you praying the Honourable Court to pass decree and judgement and the same is posted for both of your appearance. Both of you hereby directed to appear in person or through your counsel on **15-12-2025 at 10-30 A.M.** before the Honourable Court, failing which the Honourable Court will decide the matter in your absence and pass orders.

(By the order of the Honourable Court)
M. PADMAKARA KUMAR
Advocate, Seethammapeta,
Visakhapatnam - 16

లా విద్యార్థులకు రిఫ్రెష్‌మెంట్ తరగతులు

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : న్యాయ శాస్త్ర విద్యార్థులకు అల్లూరి సీతారామరాజు విజ్ఞాన కేంద్రం ఆధ్వర్యంలో రిఫ్రెష్‌మెంట్ తరగతులు నిర్వహించారు. సోమవారం ఈ తరగతులను విజ్ఞాన కేంద్రం కార్యదర్శి డాక్టర్ బి.గంగారావు ప్రారంభించారు. పి.వెంకటరెడ్డి కార్మిక చట్టాలు, సంస్కరణలు, నయా సరళీకరణ కాలంలో అవి ఎలా మారుతున్నాయి, ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్ పేర కార్మిక చట్టాలని పెట్టుబడులకు లాభదాయకంగా ఎలా మారుస్తూ ఉన్నారు, నాలుగు లేబర్ కోడ్‌లుగా కుదించడం వంటి అంశాలను బోధించారు. కార్మిక చట్టాలను కార్మికుల శ్రమశక్తి కొల్లగొట్టకుండా, కార్మికుల సంక్షేమానికి అనుగుణంగా మార్చాల్సిన అవసరాన్ని, లేబర్, ఇతర ఎన్ఫోర్స్‌మెంట్ డిపార్ట్ మెంట్ల అవసరాన్ని తెలియజేశారు. ఈ సెషన్‌కు అసిస్టెంట్ ప్రొఫెసర్ యుగంధర్ భూపతి అధ్యక్షత వహించారు.

In the Honourable Court of the Family Judge at Vizianagaram
Crl. M.P. 420/2025 in F.C.M.C. 12/2016.

Between :
Rongali Hemalatha and 2 others
.......Petitioners
And :
Rongali Srinivasa Rao .....Respondent

Notice to Respondent

Rongali Srinivasa Rao S/o late Ramu, Type-III, Railway Quarters, 556/1, Jail Area, Dondaparthy, Near D.R.M. office Back side, Visakhapatnam.

Hg. Dt. 21-11-2025

పైన తెలిపిన కేసులు పిటిషనర్లు రెస్పాండెంట్‌పై దాఖలు చేసియున్నారు. సదరు కేసులో మీకు శ్రీ కోర్టువారి నుండి ఎన్ని పర్యాయములు నోటీసులు పంపగా మీరు తీసుకోనందున మీకు నోటీసు నిమిత్తం తేది 21-11-2025 వాయిదా ఉన్నదని సదరు వాయిదాకు మీరు ప్రత్యక్షంగా కాని లేదా మీ తరపున వకీలు గారి ద్వారా గాని పై కోర్టులో **తేది : 21-11-2025దిన ఉదయం గం॥10-30ని॥**లకు హాజరై మీ యొక్క వాదనలు విన్నవించుకోవలెను. లేని యెడల శ్రీ కోర్టువారు మీ పరోక్షంన తీర్మాణించెదరని ఈ పత్రికాముఖంగా తెలియజేయడమైనది.

By the order of the Honourable Court.

B.S. Kumar,
Advocate for the petitioners
Vizianagaram.
Cell: 7780409899

IN THE HONOURABLE COURT OF THE 3rd ADDL.CIVIL JUDGE (JUNIOR DIVISION) AT VISAKHAPATNAM
I.A. No. 451/2025
O.S. NO.990/2025

Between:
Karni Madhu Kiran
. . . Petitioner/Plaintiff
And:
1) Srirangam Deepak Kumar
2) Srirangam Venkata Joga Rao
...Respondents/Defendants

I.A.NOTICE & SHOWCAUSE NOTICE

To
1) Srirangam Deepak Kumar, S/o. S. Venkata Joga Rao, Hindu, Aged 35 years, residing at D.No.5-156/6 Flat No. F-3, First Floor, Sankar Nivas Apartment, Venkatadri Nagar, Sujatha Nagar, Pendurthy Mandal, Visakhapatnam-530 051
2) Srirangam Venkata Joga Rao, S/o. S.Venkata Rao, Hindu, aged 62 years, rest-do-

Take Notice that the above petitioner/plaintiff filed suit for recovery of Rs. 13,81,933/- and for other reliefs against both of you along with suit the above petitioner filed petition U/O 38 R 5 CPC for attachment of notice mentioned schedule property till disposal of suit. The Honourable Court issued show cause notice calling upon you to furnish security for Rs. 13,81,933/- within 48 Hours from the date of publication failing which the notice mentioned schedule property will be attached and posted the matter to **15-12-2025 at 10-30 A.M.** for your appearance to file counter and furnishing security, failing which the Honourable Court will decide the matter in your absence and pass orders.

SCHEDULE

The 2nd Respondent/2nd Defendant is going to receive the below mentioned amounts from the Honourable Principal Civil Judge (Senior Division) Court at Visakhapatnam.

Amount lying in the C.C. Deposit in O.S. No. 255/2024 Payable by the Principal Civil Judge (Senior Division) at Visakhapatnam Rs. 10,00,000/-

(By the order of the Honourable Court)
M. PADMAKARA KUMAR
Advocate, Seethammapeta,
Visakhapatnam - 16.

‘అనంతుని’ దీపోత్సవానికి ఏర్పాట్లు పూర్తి

ఎసిపి అప్పలరాజు

సమావేశంలో మాట్లాడుతున్న ఎసిపి అప్పలరాజు

ప్రజాశక్తి -పద్మనాభం : పద్మనాభంలోని అనంతపద్మనాభ స్వామి దీపోత్సవంలో భక్తులకు ఎటువంటి ఇబ్బందులు కలుగకుండా అన్ని ఏర్పాట్లూ పూర్తిచేసినట్లు ఎసిపి అప్పలరాజు తెలిపారు. కుంతీ మాధవస్వామి ఆలయ ప్రాంగణంలో సోమవారం ఏర్పాటుచేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ, కుంతీ మాధవ స్వామి ఆలయం, కొండ పైభాగంలో ఉన్న అనంత పద్మనాభ స్వామి ఆలయాలను, ఘాట్ రోడ్డును జిల్లా పోలీసు ఉన్నతాధికారులు పరిశీలించారని, భక్తులు రాకపోకలపైన స్థానిక అధికారులతో చర్చించి చర్యలు చేపట్టినట్లు తెలిపారు. 500 మంది వివిధ హోదాల్లో ఉన్న పోలీసులను నియమించారని చెప్పారు. వీరితో పాటు వాలంటీర్లు, దేవస్థానం సిబ్బందిని, రెవెన్యూ శాఖ సిబ్బంది, అవసరం మేరకు ఇతర శాఖల నుండి సిబ్బంది సేవలను దీపోత్సవ కార్యక్రమాల్లో వినియోగించుకోనున్నట్లు తెలిపారు. భక్తులకు ఇబ్బందులు లేకుండా మెట్లు మార్గం, ఘాట్ రోడ్డులో తాగునీటి సౌకర్యం, మరుగుదొడ్లు ప్రత్యేకంగా ఏర్పాటుచేసినట్లు చెప్పారు. 19వ తేదీన ఈ దీపోత్సవాన్ని పురస్కరించుకొని పద్మనాభం గ్రామానికి వచ్చే బంధువులు ఒక రోజు ముందే చేరుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో స్థానిక సిఐ సిహెచ్ శ్రీధర్, ఎస్ఐ సురేష్, ఎంపిడిఒ రూపేష్, డిప్యూటీ తహశీల్దార్ చంద్రశేఖర్, జెడ్పిటిసి మాజీ సభ్యులు కె.దామోదరరావు, కె.నగేష్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

రోగులకు పండ్లు పంపిణీ చేస్తున్న టిడిపి నాయకులు

మేయర్ పీలా జన్మదిన వేడుకలు

ప్రజాశక్తి-యంత్రాంగం

అనకాపల్లి రూరల్ : జీవీఎంసీ మేయర్ పీలా శ్రీనివాసరావు జన్మదిన వేడుకలు అనకాపల్లిలో సోమవారం ఘనంగా జరిగాయి. స్థానిక ఎన్టీఆర్ జిల్లా ఆసుపత్రిలో గర్భిణులకు, రోగులకు పండ్లు, రొట్టెలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో గవర కార్పొరేషన్ చైర్మన్ మళ్ళ సురేంద్ర, ఎఎంసి చైర్మన్ పచ్చికూర రాము, టిడిపి మండల అధ్యక్షులు కర్రి బాబీ, బోలిశెట్టి శ్రీనివాసరావు, టిడిపి జీవీఎంసీ వార్డుల ఇన్‌ఛార్జులు జోగి నాయుడు, పోలారపు త్రినాధ్, బొద్దపు ప్రసాద్, బత్తుల రమేష్, దాడి జగన్, సురే సతీష్ కుమార్, పిట్ల రాజు పాల్గొన్నారు.

శుభాకాంక్షలు తెలిపిన బెహరా

గోపాలపట్నం : విశాఖ నగర మేయర్ పీలా శ్రీనివాసరావుకు జనసేన నాయకులు బెహరా భాస్కరరావు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఇల్లపు సురేష్, మనోహర్, జనసేన నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

జన్మదిన శుభాకాంక్షలు తెలుపుతున్న బెహరా భాస్కరరావు

పిజిఆర్ఎస్‌కు 4 అర్జీలు

ప్రజాశక్తి -భీమునిపట్నం : జివిఎంసి ఒకటో జోన్ కార్యాలయంలో సోమవారం జరిగిన ప్రజా ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థకు వివిధ సమస్యలపై 4 అర్జీలు అందాయి. ఇందులో పట్టణ ప్రణాళికా విభాగానికి సంబంధించి 2, ప్రజారోగ్యం, రెవెన్యూ విభాగానికి సంబంధించి ఒక్కో అర్జీ అందినట్లు జోనల్ కమిషనర్ ఒమ్మి అయ్యప్పనాయుడు తెలిపారు. వీటిని తదుపరి చర్యల నిమిత్తం ఆయా విభాగాల అధికారులకు పంపించినట్లు జోనల్ కమిషనర్ తెలిపారు

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

ప్రజాశక్తి -భీమునిపట్నం : అండర్ గ్రౌండ్ కేబుల్ వర్క్, నిర్వహణా పనుల నిమిత్తం జివిఎంసి 4వ వార్డు పరిధి చేపలుప్పాడ, కాపులుప్పాడ, ఎపిఐఐసి 33 /11కెవి మరమ్మత్తుల నిమిత్తం మంగళవారం ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ఎపిఇపిడిసిఎల్ ఆపరేషన్ జోన్ -3 ఇఇ బి.సింహాచలంనాయుడు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. వార్డు పరిధి కల్లివానిపాలెం, కాపులుప్పాడ, కొత్తూరు, చేపల దిబ్బడిపాలెం, గోవుపేట, మంగమారి పేట, తిమ్మాపురం ప్రాంతాలకు విద్యుత్ సరఫరా ఉండదని, వినియోగదారులు గమనించి సహకరించాలని కోరారు.

డ్రెయినేజీల్లో పూడికల తొలగింపు

ప్రజాశక్తి -తగరపువలస : జివిఎంసి 2వ వార్డు పరిధి సంగివలస, అల్లూరి సీతారామరాజు కాలనీ, సబ్బివారి వీధి, దివీస్ పార్క్ పరిధిలో చెరువులోకి నీరు వెళ్లే డ్రెయినేజీ పూర్తిగా తుప్పలు, చెత్తతో నిండిపోయింది. వార్డు కార్పొరేటర్ చిన్నికుమారి లక్ష్మి ఆదేశాలతో జివిఎంసి సిబ్బంది జెసిబి సహాయంతో తుప్పలు, మట్టిని తొలగించారు.

వైసిపి కార్యాలయంపై దాడి పిరికిపంద చర్య

ప్రజాశక్తి- తగరపువలస : హిందూపురం నియోజకవర్గంలోని వైసిపి కార్యాలయంపై టిడిపి అల్లరిమూకలు విచక్షణ కోల్పోయి జరిపిన దాడిని జివిఎంసి 2వ వార్డు వైసిపి ఇన్‌ఛార్జి శిల్లా కరుణాకర్ రెడ్డి తీవ్రంగా ఖండించారు. ఇది పిరికిపంద చర్యగా అభివర్ణించారు. సోమవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ, రాజకీయ విమర్శలకు సమాధానం చెప్పాలి తప్ప దాడులకు దిగడం సరికాదన్నారు. ఈ చర్యలు ప్రజాస్వామ్యంపై ప్రత్యక్ష దాడి అని పేర్కొన్నారు. దిగజారుడు రాజకీయాలు మానుకుని ప్రజాస్వామ్యాన్ని గౌరవించాలని కూటమి నాయకులకు సూచించారు.

కిడ్నీ రాకెట్ దోషులను శిక్షించాలి : ఐద్వా

ప్రజాశక్తి - ఆనందపురం: ఆనందపురం మండలం, వెలంకి పంచాయతీ బొడ్డపల్లి గ్రామానికి చెందిన యమున ప్రాణాలు తీసిన కిడ్నీ రాకెట్ కేసులో దోషులందరినీ వెంటనే అరెస్టు చేసి కఠినంగా శిక్షించాలని ఐద్వా విశాఖ జిల్లా కమిటీ డిమాండ్ చేసింది. బాధిత కుటుంబానికి రూ.50 లక్షలు నష్టపరిహారం చెల్లించాలని కోరింది. యమున తల్లి సూరమ్మ, తమ్ముడు నాగేంద్ర, మరదలు సరితలను ఐద్వా జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు ఆర్ఎన్.మాధవి, వై.సత్యవతి, భీమిలి ఐద్వా కార్యదర్శి కె.నాగరాణి కలిసి సోమవారం పరామర్శించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, ఈ కేసులో కొందరిని అదుపులోకి తీసుకుని పోలీసులు విచారిస్తున్నప్పటికీ, సంఘటనకు కారణమైన కీలక వ్యక్తులు ఇంకా అరెస్టు కాలేదని తెలిపారు. హాస్పిటల్ హార్డ్‌డిస్క్, సీసీ కెమెరా ఫుటేజ్ తొలగించడాన్ని చూస్తే అవయవాల అక్రమ రవాణా పెద్ద ఎత్తున జరుగుతోందనే అనుమానాలను బలపరుస్తోందని అభిప్రాయపడ్డారు. కేసును నిష్పక్షపాతంగా దర్యాప్తు చేసి సంబంధిత వైద్య బృందం, హాస్పిటల్ యాజమాన్యంపై కూడా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఇటువంటి సంఘటనలు జరగకుండా అన్ని జిల్లాల్లో మహిళలు, యువతులకు అవగాహన కార్యక్రమాలు చేపట్టాలని కోరారు.

యమున కుటుంబీకులతో మాట్లాడుతున్న ఐద్వా నాయకులు

ఔషధ రంగంలో నాణ్యతకు ప్రాధాన్యత

ప్రజాశక్తి-మధురవాడ : భారతదేశ ఔషధరంగం ప్రపంచంలో తృతీయస్థానంలో ఉందని, ముఖ్యంగా ప్రపంచంలోని వివిధ దేశాలకు 20 శాతం జనరిక్ ఔషధాలు భారతదేశం నుంచే ఎగుమతి అవుతున్నాయని, ఈ నేపథ్యంలో నాణ్యతా ప్రమాణాలకు అత్యంత ప్రాధాన్యత ఉందని గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయం స్కూల్ ఆఫ్ ఫార్మశీ ప్రిన్సిపల్ ప్రొఫెసర్ ఎల్.శ్రీనివాస్ పేర్కొన్నారు. ఔషధరంగంలో నాణ్యతా వారోత్సవాల సందర్భంగా సోమవారం జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ, సామాన్యులకు అందుబాటులో ఉండేలా 200 దేశాలకు భారతీయ ఔషధాలు ఎగుమతి అవుతున్నాయని, వాటి విలువ 30 బిలియన్ డాలర్లకు చేరుకుందని తెలిపారు. చిన్న పొరపాటు సహితం ఔషధ రంగంలో తీవ్ర ప్రభావాన్ని చూపుతుందన్నారు. ఈ కారణంగా ఔషధాల తయారీలో నిబంధనలను పాటిస్తూ నిరంతరం నాణ్యతపై దృష్టి నిలపాలని కోరారు. విఎస్ఆర్ఎ.లైఫ్ సైన్సెస్ రీసెర్చి డైరక్టర్ డాక్టర్ అరుణ్ కుమార్ గుప్తా మాట్లాడుతూ, సిప్రాఫ్లాక్సిసిన్ ఔషధ తయారీలో నూతన సాంకేతిక పరిజ్ఞానంలో నాణ్యతా ప్రమాణాలు ఎలా పాటిస్తోందో తెలియజేశారు. గీతం ఫార్మస్యూటికల్ క్వాలిటీ ఎస్యూరెన్స్ విభాగం అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ సాగర్ సుమన్‌పాండా ఔషధాల నాణ్యతా గుర్తింపులో సాంకేతిక అంశాలను వివరించారు. కార్యక్రమంలో డాక్టర్ జి.సౌజన్య పాల్గొన్నారు.

వికలాంగత్వం నిర్ధారణ పరీక్షలు

ప్రజాశక్తి -భీమునిపట్నం : స్థానిక ప్రభుత్వ సామాజిక ఆరోగ్య కేంద్రంలో రెగ్యులర్‌గా జరిగే వికలాంగత్వ నిర్ధారణ పరీక్షల్లో భాగంగా సోమవారం ముగ్గురికి పరీక్షలు నిర్వహించారు. తమకు సర్టిఫికెట్ ఇవ్వాలని కోరుతూ సమీపంలో ఉన్న వార్డు, గ్రామ సచివాలయంలో స్లాట్ బుకింగ్ చేసుకున్న 15 మందిలో ముగ్గురు మాత్రమే పరీక్షలు చేయించుకున్నారు. స్లాట్ బుకింగ్ చేసుకున్న అనంతరం సంబంధిత పత్రాలతో హాజరైన ముగ్గురికి కెజిహెచ్ ఆర్థోపెడిక్ వైద్యులు కృష్ణమూర్తి వివిధ పరీక్షలు చేసి, సంబంధిత పత్రాలను పరిశీలించారు. ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ ఎం.ఫణికుమార్, డేటా ఎంట్రీ ఆపరేటర్ దివ్య పాల్గొన్నారు.

మురుగు నీటిని మళ్లించాలని వినతి

ప్రజాశక్తి -భీమునిపట్నం : స్థానిక బ్యాంక్ కాలనీ సమీపంలో ఒకప్పటి మంచి నీటి గెడ్డల్లో మురుగు నీటిని మళ్లించడం ద్వారా అవి మురుగు నీటి కూపాలుగా మారుతున్నాయని, ప్రత్యామ్నాయంగా సిమెంట్ కాల్వల ద్వారా మురుగు నీటిని మళ్లించాలని కోరుతూ స్థానికులు కె శ్రీనివాసకుమార్ సోమవారం జోనల్ కమిషనర్ ఒమ్మి అయ్యప్పనాయుడుకు పిజిఆర్ఎస్‌లో వినతి పత్రం అందజేశారు. ఇష్టారీతిన వెలుస్తున్న బహుళ అంతస్తుల భవనాలతో స్థానికులు పడుతున్న ఇబ్బందులను వినతి పత్రంలో పేర్కొన్నట్లు వివరించారు. మురుగు నీటిని, వర్షపు నీరు వెళ్లే కాల్వలతో అనుసంధానించకూడదని నేషనల్ గ్రీన్ ట్రిబ్యునల్, కాలుష్య నియంత్రణ మండలి రూపొందించిన నిబంధనల్లో స్పష్టంగా పేర్కొన్నప్పటికీ ఈ ప్రాంతంలో అమలుకు నోచుకోవడం లేదని వివరించారు.

జివిఎంసి కార్మికులకు యూనిఫాం అందజేత

ప్రజాశక్తి -యంత్రాంగం

ఆరిలోవ : జివిఎంసి 13వ వార్డు పరిధి పారిశుధ్య కార్మికులకు ఆరిలోవ కాలనీ వార్డు కార్యాలయంలో సోమవారం కార్పొరేటర్ కెల్ల సునీత సత్యనారాయణ, వార్డు టిడిపి అధ్యక్షులు ఏడువాక సన్యాసిరావు, స్థానిక నాయకులతో కలిసి ఏకరూప దుస్తులను పంపిణీచేశారు. 27 మంది మహిళలకు మూడు చీరలు, రెండు టవల్స్ చొప్పున, 24 మంది పురుషులకు 2 జతల ఏకరూప దస్తులు, రెండు టవల్స్ చొప్పున అందజేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ, కూటమి ప్రభుత్వం వచ్చిన తరువాత పారిశుధ్య కార్మికులపై ప్రత్యేక శ్రద్ధ తీసుకొని పనిముట్లు, దుస్తులు అందజేయడం ఆనందదాయకమన్నారు. ఈ కార్యక్రమంలో శానటరీ ఇన్‌స్పెక్టర్ రామారావు, వార్డు టిడిపి కార్యదర్శి తురకపూడి బాలస్వామి, నాయకులు పొత్రకండ ధర్మారావు, వడిసెల శ్రీను, పిఐ.బాలరాజు తదితరులు పాల్గొన్నారు.

మధురవాడ : జివిఎంసి 7వ వార్డు పరిధిలోని పారిశుధ్య కార్మికులకు యూనీఫామ్‌ను సోమవారం వార్డు కార్పొరేటర్ పిళ్లా మంగమ్మ ఆధ్వర్యంలో పంపిణీ చేశారు. 76మందికి మహిళలకు చీరలు, జాకెట్లు, తువ్వాళ్లు, పురుషులకు యూనిఫాం, తువాళు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో టిడిపి వాణిజ్య విభాగపు కార్యదర్శి పిళ్లా వెంకటరావు, జనసేన వార్డు అధ్యక్షులు నాగోతి నరసింహనాయుడు, టిడిపి అధ్యక్షులు కానూరి అచ్యుతరావు, బైపల్లి శ్రీరామ్మూర్తి పాల్గొన్నారు.

పారిశుధ్య కార్మికులకు యూనీఫాం అందజేస్తున్న కార్పొరేటర్ కెల్ల సునీత

కనీస పెన్షన్ రూ.9 వేలు చేయాలి

ఆల్ పెన్షనర్స్ అండ్ రిటైర్డ్ పర్సన్స్ అసోసియేషన్ రాష్ట్ర కార్యదర్శి కె.సుధాకరరావు

ప్రజాశక్తి- కరాస : ఇపిఎస్ 95 పెన్షనర్ల కనీస పెన్షన్ రూ.9 వేలు చేయాలని, పెన్షన్‌కు డిఎ అనుసంధానం చేయాలని ఆల్ పెన్సనర్స్ అండ్ రిటైర్డ్ పర్సన్స్ అసోసియేషన్ రాష్ట్ర కార్యదర్శి కె.సుధాకరరావు డిమాండ్ చేశారు. ఇపిఎస్-95 స్కీమ్‌ను ప్రవేశపెట్టిన రోజును పురస్కరించుకొని సోమవారం మర్రిపాలెంలోని పిఎఫ్ కార్యాలయం ఎదుట అన్ని ప్రభుత్వ, ప్రైవేటురంగ పరిశ్రమల విశ్రాంత ఉద్యోగులు పెద్ద ఎత్తున ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, గత 15 సంవత్సరాల నుండి అనేక రూపాలలో నిరసన కార్యక్రమాలను నిర్వహిస్తున్నప్పటికీ మినిమం పెన్షన్ పెంచకుండా, పెన్షనర్ల సమస్యను పరిష్కరించకుండా కేంద్ర ప్రభుత్వం మొండిగా వ్యవహరిస్తుందని విమర్శించారు. మినిమం పెన్షన్ రూ.వెయ్యితో బతుకు వెళ్లదీయలేక, ఆర్థిక, అనారోగ్య సమస్యలతో సతమతమవుతున్న పెన్షనర్లకు కనీస పెన్షన్ రూ.9 వేలకు పెంచాలని కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తూ ఈ నిరసన కార్యక్రమాన్ని చేపట్టామని తెలిపారు. అసోసియేషన్ జిల్లా కార్యదర్శి ఎస్‌కె.హుస్సేన్ మాట్లాడుతూ, 2014 సెప్టెంబర్ 1వ తేదీకి ముందు రిటైర్డ్ అయిన, ఆ తర్వాత రిటైర్డ్ అయిన వారందరికీ హయ్యర్ పెన్షన్ అవకాశం కల్పించాలని కోరారు. భార్యాభర్తలకు వైద్య సదుపాయం కల్పించాలని, కరోనా సాకు చెప్పి తొలగించిన రైల్వే రాయితీని పునరుద్ధరించాలని డిమాండ్‌చేశారు. 2025 డిసెంబరు 9,10 తేదీల్లో ఢిల్లీలో చేపట్టే ధర్నాకు అధిక సంఖ్యలో పెన్షనర్లు తరలిరావాలని విజ్ఞప్తి చేశారు. జిల్లా ఉపాధ్యక్షులు యువిఎస్ఎన్.వర్మ మాట్లాడుతూ, "ఎగ్జంటడ్ కంపెనీల ట్రస్ట్ రూల్స్ హైయ్యర్ పెన్షన్‌కు అనుకూలంగా లేవని ఇవ్వటానికి నిరాకరిస్తున్న ఇపిఎఫ్ వైఖరిని విమర్శించారు. ఇటీవల కాలంలో అనేక హైకోర్టులు పెన్షనర్లకు అనుకూలంగా తీర్పులు ఇచ్చాయని, ఆ తీర్పుల ప్రకారం అర్హులైన వారందరికీ హయర్ పెన్షన్ అమలు చెయ్యాలని కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో దీనబంధు, ఎస్.కనకేశ్వరరావు, జె.కోటేశ్వరరావు, వి.రాము, ఎ.నారాయణరావు, ఎం.అప్పలరాజు, కెఎం.కుమారమంగళం పాల్గొన్నారు.

పిఎఫ్ కార్యాలయం ఎదుట ధర్నా చేస్తున్న పెన్షనర్లు

సదరం హెల్త్ క్యాంప్‌ను ప్రారంభిస్తున్న ప్రభుత్వ విప్ గణబాబు

సదరం హెల్త్ క్యాంప్ ప్రారంభం

ప్రజాశక్తి -గోపాలపట్నం : జివిఎంసి 92వ వార్డు పరిధి గోపాలపట్నం కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌లో ఉచిత సదరం హెల్త్ క్యాంప్‌ను ప్రభుత్వ విప్ గణబాబు సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, సదరం శిబిరాలను గోపాలపట్నం కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌లో, విమ్స్ హాస్పిటల్‌లో నిర్వహించాలని కలెక్టర్ సమీక్షా సమావేశంలో కోరామని తెలిపారు. దీనిపై స్పందించిన ఆంధ్రప్రదేశ్ సెకండరీ హెల్త్ డైరెక్టర్ సదరపు స్లాట్లను విడుదల చేస్తూ ఆదేశించారని, ఈ నేపథ్యంలో గోపాలపట్నం 30 పడకల ఆసుపత్రిలో సదరన్ క్యాంపు ప్రారంభించినట్లు చెప్పారు. ఈ అవకాశాన్ని పరిసర ప్రాంతాల వికలాంగులు వినియోగించుకోవాలని కోరారు. వార్డు సచివాలయాల్లో సదరం స్లాట్ బుక్ చేసుకొని ఆ స్లాట్ ద్వారా ఇక్కడ సదరం సేవలు, సర్టిఫికెట్ పొందాలని సూచించారు. ఈ కార్యక్రమంలో 56వ వార్డు కార్పొరేటర్ శరగడం రాజశేఖర్, ఆర్థోపెడిక్ డాక్టర్ బంగారురాజు సూపరింటెండెంట్ సుజాత, కూటమి నేతలు, హాస్పిటల్ డైరెక్టర్లు పాల్గొన్నారు.

అప్పన్న నిత్యాన్నప్రసాదానికి విరాళం

ప్రజాశక్తి- వేపగుంట : శ్రీ వరాహ లక్ష్మీ నసింహస్వామి నిత్యాన్నప్రసాదానికి అనకాపల్లి జిల్లా, మంత్రిపాలెం గ్రామానికి చెందిన జేరిపోతల అప్పారావు దంపతులు రూ.1,00,116 విరాళాన్ని చెక్కును దేవస్థానం ప్రోటోకాల్ కార్యాలయంలో సీనియర్ సహాయకులు వి.సూర్యనారాయణకు అందజేశారు. అనంతరం, దాతలకు స్వామివారి దర్శనం కల్పించారు. దాతలకు ఆలయ పర్యవేక్షణాధికారి కె.వెంకటేశ్వరరావు కృతజ్ఞతలు తెలియజేస్తూ, స్వామివారి ప్రసాదాలను అందజేశారు.

జోనల్ కమిషనర్‌కు వినతిపత్రం అందిస్తున్న ఆలయ కమిటీ ప్రతినిధులు

సుబ్రహ్మణ్య షష్టికి సహకారం అందించాలని వినతి

ప్రజాశక్తి -మాధవధార : కంచెరపాలెం ఇందిరానగర్-1లో ఉన్న సుబ్రహ్మణ్య స్వామి దేవాలయంలో ఈ నెల 26న జరపతలపెట్టిన స్వామి జన్మ షష్టి మహోత్సవానికి హాజరయ్యే భక్తులకు వివిధ సౌకర్యాలను కల్పించేందుకు సహాయ సహకారాలు అందించాలని కోరుతూ దేవస్థానం కమిటీ గౌరవాధ్యక్షుడు గొండు సీతారాం సారథ్యంలో కమిటీ ప్రతినిధులు సోమవారం మాధవధారలోని జివిఎంసి నార్త్ జోన్ కార్యాలయంలో జోనల్ కమిషనర్ బొడ్డేపల్లి రాముకు వినతిపత్రం అందించారు. దీనిపై జోనల్ కమిషనర్ స్పందిస్తూ ప్రజారోగ్యం, నీటి సరఫరా, స్ట్రీట్ లైటింగ్ విభాగాల అధికారులకు పలు ఆదేశాలు జారీచేశారు. సుబ్రహ్మణ్య షష్టి మహోత్సవానికి పూర్తి సహాయ సహకారాలు అందిస్తామని జోనల్ కమిషనర్ చెప్పారు.

మహిళలు, పిల్లల అభివృద్ధే సెయింట్ ఆన్స్ ధ్యేయం

ప్రజాశక్తి -ములగాడ : మహిళలను, పిల్లలను అభివృద్ధి చేయడమే సెయింట్ ఆన్స్ సంస్థల ధ్యేయమని బిషప్ డాక్టర్ ఉడుముల బాల అన్నారు. సెయింట్ ఆన్స్ కళాశాల స్వర్ణోత్సవ ప్రారంభలో ఆయన మాట్లాడుతూ, సెయింట్ ఆన్స్ విద్యార్థులు మానవతా విలువలు, క్రమశిక్షణ, సేవా భావంతో జీవించాలని కోరారు. సెయింట్ ఆన్స్ సంస్థల సుపీరియర్ జనరల్ సిస్టర్ పౌలినా ఆగస్టిన్ మాట్లాడుతూ, ఉన్నత విద్యాసంస్థను నడపడమంటే జాతిని నిర్మించడమేనని పేర్కొన్నారు. విశాఖపట్నం ప్రోవెన్షియల్ సుపీరియర్ సిస్టర్ శాంధ్రీనా, విశాఖపట్నం ఆర్చి డయాసిస్ ఛాన్సలర్ ఫాదర్ డాక్టర్ జాన్ ప్రకాష్, పారిస్ ప్రీస్ట్ ఫాదర్ జీవన్‌బాబు, ప్రముఖ వైద్య నిపుణులు డాక్టర్ సన్యాసమ్మ, కళాశాల కరస్పాండెంట్ సిస్టర్ గెసిల్లా, డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ సిస్టర్ ప్రేమకుమారి, జూనియర్ కళాశాల ప్రిన్సిపల్ సిస్టర్ క్యాస్లిన్ ప్రసంగించారు.

మాతృ మరణాలపై సమీక్ష

సమీక్షా సమావేశంలో మాట్లాడుతున్న డిఎంహెచ్ఒ జగదీశ్వరరావు

ప్రజాశక్తి-సీతమ్మధార : జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి కార్యాలయంలో మాతృ మరణాలపై జిల్లా మెటర్నిటీ డెత్ సర్వేలేన్స్ రెస్పాన్స్ కమిటీ సమీక్షా సమావేశం సోమవారం నిర్వహించారు. సెప్టెంబర్ నెలలో కణితి ప్రాథమిక ఆరోగ్యకేంద్రం పరిధిలో 1, నక్కవానిపాలెం పట్టణ ఆరోగ్యకేంద్రం పరిధిలో 1 మాతృ మరణంపై సమీక్ష జరిపారు. ఈ సందర్భంగా డిఎం అండ్ హెచ్ఒ డాక్టర్ పి.జగదీశ్వరరావు మాట్లాడుతూ, మాతృమరణాలు ఇకముందు సంభవించకుండా చూసుకోవాల్సిన బాధ్యత సంబంధిత ఆరోగ్య కేంద్రం మెడికల్ అధికారిపై ఉంటుందన్నారు. సంబందిత ఎఎన్ఎం సమయానికి గర్భిణీకి అవసరమైన సేవలను అందజేయాలన్నారు. ఇకముందు మాతృమరణాలు జరిగితే చర్యలు తప్పవని హెచ్చరించారు. హైరిస్క్ గర్భిణులు ప్రసవానికి వచ్చినప్పుడు కాలయాపన చేయకుండా కెజిహెచ్‌కు గాని విజిహెచ్‌కుగాని రిఫర్ చేయాలని సూచించారు. ఎఎన్ఎం, ఆశా కార్యకర్తలు ఆడపిల్లలకు కౌమారదశ నుండి జరిగే మార్పులపై అవగాహన కల్పించాలని, గర్భిణులకు గర్భాధారణ నుండి అవగాహన కల్పించాలని సూచించారు. హైరిస్క్ గర్భిణులను ముందుగానే గుర్తించి వారికి సమయానికి టీకాలు, పోషకాహారం, ఆరోగ్య సేవలను అందేటట్లు చూడాలన్నారు. ఈ సమావేశంలో డాక్టర్ హెచ్ఆర్‌కె.దొర, ఎపివివిపి డాక్టర్ ఉషాప్రసాద్, సూపరింటెండెంట్, విజిహెచ్ డాక్టర్ లూసీ, డిఐఒ డాక్టర్ ఎంవిఇ.రమానాయుడు తదితరులు పాల్గొన్నారు.

వికసిత్ భారత్ సాధనలో యువత పాత్ర ప్రధానం

ప్రజాశక్తి-ఉక్కునగరం : వికసిత్ భారత్ సాధనలో యువత పాత్ర ప్రధానమైనదని విశాఖ ఎంపీ ఎం.శ్రీభరత్ పేర్కొన్నారు. దువ్వాడలోని విజ్ఞాన్ ఇంజినీరింగ్ కళాశాలలో 'వికసిత్ భారత్ 2025 - యంగ్ లీడర్స్ డైలాగ్' కార్యక్రమంలో భాగంగా సోమవారం 'టెక్ ఫర్ వికసిత్ భారత్ - క్వాంటమ్ కంప్యూటింగ్' అంశంపై రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. విజ్ఞాన్ ఇన్‌స్టిట్యూట్, క్వాంటమ్ పరిశోధనా సంస్థ మధ్య ముఖ్యమైన ఎంఒయు కుదిరింది. ఈ ఎంఒయు కోసం ఫ్యాకల్టీ కో-ఆర్డినేటర్లుగా రోహిణి కుమార్, డాక్టర్ ఓంకార్ బాధ్యతలు స్వీకరించారు.

వర్చువల్‌గా ఎంపీ శ్రీభరత్ పాల్గొని మాట్లాడుతూ, క్వాంటమ్ కంప్యూటింగ్ వంటి అభివృద్ధి దిశను మార్చే టెక్నాలజీలు భారతదేశాన్ని ప్రపంచ సాంకేతిక శక్తిగా నిలబెడతాయన్నారు. ఈ తరహా కార్యక్రమాలు విద్యార్థుల్లో పరిశోధనాభిముఖతను పెంచుతాయని తెలిపారు. ఎపి సైన్స్ సిటీ సిఇఒ కేసినేని వెంకటేశ్వర్లు మాట్లాడుతూ, సైన్స్ సిటీలో యువతకు అత్యాధునిక టెక్నాలజీలపై శిక్షణ అందించే అనేక అవకాశాలు సృష్టిస్తున్నామని తెలిపారు. ఎఐ, డేటా సైన్స్, క్వాంటమ్ టెక్నాలజీలలో అపార అవకాశాలు ఉన్నాయని చెప్పారు. విద్యార్థులు సృజనాత్మకతకు ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. ఐఆర్ఎఎస్ సీనియర్ డివిజనల్ ఫైనాన్షియల్ మేనేజర్ హరనాథ్ మొపూరి మాట్లాడుతూ, నేటి ప్రపంచ ఆర్థిక వ్యవస్థలో సాంకేతికత కీలక పాత్ర పోషిస్తోందన్నారు. క్వాంటమ్ కంప్యూటింగ్ రాబోయే దశాబ్దంలో డేటా విశ్లేషణలో విప్లవాత్మక మార్పులు చేస్తుందని, విద్యార్థులు ముందస్తుగా నైపుణ్యాలు నేర్చుకోవాలని సూచించారు. క్యుబిటెక్ సిఇఒ పృథ్వీ పిన్నాక మాట్లాడుతూ, భారతదేశంలో క్వాంటమ్ టెక్ స్టార్టప్‌లకు విశ్వవ్యాప్త అవకాశాలు ఉన్నాయన్నారు. యోభా ఫౌండేషన్ వ్యవస్థాపకులు చందన్‌రావు మాచా మాట్లాడుతూ, భారత యువతలో టెక్నాలజీ మార్పులను నడిపించే శక్తి అపారంగా ఉందన్నారు. విజ్ఞాన్ సిఇఒ ఎన్.శ్రీకాంత్ మాట్లాడుతూ భారత వికాస లక్ష్యాలను చేరుకోవడంలో విద్యాసంస్థలు కీలకమని, క్వాంటమ్ కంప్యూటింగ్ వంటి భావితరాల టెక్నాలజీలు దేశాన్ని తదుపరి దశ శక్తిగా మార్చగల సామర్థ్యం కలిగిఉన్నాయని తెలిపారు. విద్యార్థులకు ఆధునిక సాంకేతిక జ్ఞానం అందించడంలో విజ్ఞాన్ ముందంజలో ఉంటుందని చెప్పారు.

అపార్ట్‌మెంట్‌కు దారి కల్పించాలని నిరసన

ప్రజాశక్తి-సీతమ్మధార : తమ అపార్ట్‌మెంట్‌కు దారి ఉంచాలని కోరుతూ జివిఎంసి 26వ వార్డు పరిధి రామకృష్ణనగర్‌లో మర్రిచెట్టు వద్ద ఉన్న రమణాజీ ఎన్‌క్లేవ్ అపార్ట్‌మెంట్ వాసులు సోమవారం అపార్ట్‌మెంట్ వద్ద నిరసన తెలిపారు. ఈ సందర్భంగా అపార్ట్‌మెంట్ నివాసి వెంకటేష్ మాట్లాడుతూ, ఈ అపార్ట్‌మెంట్ నిర్మాణదారుడు మరో అపార్ట్‌మెంట్‌ను నిర్మిస్తున్నాడని, ఇప్పుడు తమకు రహదారిగా కేటాయించిన స్థలాన్ని కలిపి కొత్త అపార్ట్‌మెంట్‌ను నిర్మిస్తున్నాడని తెలిపారు. తమ అపార్ట్‌మెంట్‌కు కనీసం దారి లేకపోవడంతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని ఆవేదన వ్యక్తంచేశారు. గెడ్డకు ఆనుకుని స్థలం ఉందని, కనీస బఫర్ జోన్ కూడా వదలకుండా నిర్మాణం చేపట్టి బిల్డర్ ఇబ్బందులకు గురి చేస్తున్నాడని తెలిపారు. జివిఎంసి అధికారులు స్పందించి తమకు న్యాయం చేయాలని కోరారు. ఈ నిరసన కార్యక్రమంలో చంటి, మల్లేశ్వరరావు, రమణ, రామారావు, పూర్ణ పాల్గొన్నారు.

31 వేల రూఫ్‌టాప్ సోలార్ ప్లాంట్ల ఏర్పాటు

ప్రజాశక్తి-సీతమ్మధార : ఆంధ్రప్రదేశ్ తూర్పు ప్రాంత విద్యుత్ పంపిణీ సంస్థ పరిధిలోని వినియోగదారులకు 100 మెగావాట్ల సామర్థ్యం కలిగిన 31 వేల రూఫ్ టాప్ సోలార్ ప్లాంట్లను ఏర్పాటు చేశామని సంస్థ చైర్మన్ మేనేజింగ్ డైరెక్టర్ పృథ్వీతేజ్ ఇమ్మడి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. పిఎం సూర్యఘర్ పథకంలో భాగంగా ఇప్పటివరకు 1,00,026 కిలోవాట్ల సామర్థ్యం కలిగిన 31,022 రూఫ్ టాప్ సోలార్ ప్లాంట్లను గ్రిడ్‌కు అనుసంధానించినట్లు వివరించారు. ఒక్కసారి పెట్టుబడితో 20 ఏళ్ల వరకు ఇంటికి సరిపడా విద్యుత్ వినియోగించడంతో పాటు, మిగిలిన విద్యుత్‌ను గ్రిడ్ కు పంపించి ఆదాయం పొందే అవకాశాలు ఉండడంతో దీనికి ఆదరణ పెరుగుతోందని తెలిపారు. ఒక కిలోవాట్ సామర్థ్యం కలిగిన సోలార్ రూఫ్ టాప్ ప్లాంట్‌ను ఏర్పాటు చేసుకోవాలనుకొనే వినియోగదారులు తమ ఇంటి పైకప్పుపై కనీసం 100 చదరపు అడుగుల స్థలం కలిగి ఉండాలన్నారు. ఒక కిలోవాట్ సామర్థ్యం కలిగిన సోలార్ ప్లాంట్ ఏర్పాటు చేసుకున్నవారికి రూ.30 వేలు, 2 కిలోవాట్లకు రూ.60 వేలు, 3 కిలోవాట్లకు గరిష్టంగా రూ.78 వేలు వరకు సబ్సిడీ లభిస్తుందని తెలిపారు. 3 కిలోవాట్లు ఏర్పాటు చేసుకొన్న ఇంటికి నెలకు కనీసం 360 నుంచి 450 యూనిట్ల విద్యుత్ ఉత్పత్తి అవుతుందని, ఇంటి అవసరాలకు వాడుకోగా మిగిలిన విద్యుత్‌ను ఎపిఇపిడిసిఎల్‌కు విక్రయించడం ద్వారా అదనపు ఆదాయాన్ని పొందవచ్చని వివరించారు. అపార్ట్మెంట్స్ కామన్ సర్వీస్‌కు ఉన్న కాంట్రాక్టు లోడుకు అనుగుణంగా సోలార్ రూఫ్ టాప్ ఏర్పాటు చేసుకోవచ్చని తెలిపారు. 500 కిలోవాట్ల వరకు కిలోవాట్‌కు రూ.18 వేలు చొప్పున సబ్సిడీ లభిస్తుందని వివరించారు. మరిన్ని వివరాలకు www.apeastern-power.com వెబ్ సైట్‌ను సందర్శించాలని సూచించారు. సందేహాల నివృత్తి కోసం ప్రజలు టోల్ ఫ్రీ నెంబర్ 1912కు ఫోన్ చేయవచ్చని పేర్కొన్నారు.

అప్పన్న సహస్రనామార్చన

ప్రజాశక్తి- వేపగుంట : శ్రీ వరాహలక్ష్మీనృసింహ స్వామి సహస్రనామార్చన నేత్రపర్వంగా సాగింది. ఆర్జిత సేవల్లో భాగంగా ఉత్సవమూర్తి గోవిందరాజస్వామిని ఉభయ దేవేరులతో మండపంలో అధిష్టింపజేశారు. సహస్రనామార్చనలో పాల్గొన్న భక్తుల, గోత్రనామాలతో సంకల్పం చెప్పి పాంచరాత్రాగమశాస్త్రం విధానంలో విశ్వక్సేనారాధన, పుణ్యాహవచనాలతో కార్యక్రమాన్ని కమనీయంగా జరిపించారు.

అర్జీదారులకు నాణ్యమైన పరిష్కారం చూపాలి

పిజిఆర్ఎస్‌కు 268 వినతులు

ప్రజాశక్తి-అనకాపల్లి : పిజిఆర్ఎస్‌కు వచ్చే అర్జీదారుల సమస్యలను అధికారులు వ్యక్తిగతంగా క్షేత్ర స్థాయిలో పర్యటించి వారు సంతృప్తి చెందేలా సమస్యలను వేగవంతంగా పరిష్కరించాలని కలెక్టర్ విజయ కృష్ణన్ ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో నిర్వహించిన పిజిఆర్ఎస్‌లో కలెక్టర్‌తో పాటు, జాయింట్ కలెక్టర్ ఎం.జాహ్నవి, డిఆర్వో వై.సత్యనారాయణరావు ప్రజల నుండి అర్జీలు స్వీకరించారు. మొత్తం 268 అర్జీలు స్వీకరించగా, వాటిలో 133 రెవెన్యూ, 33 పంచాయతీరాజ్, 18 సర్వే సెటిల్మెంట్ అండ్ ల్యాండ్ రికార్డ్స్, 16 పోలీస్ శాఖలకు చెందిన ఫిర్యాదులు అత్యధికంగా ఉన్నాయి. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ అర్జీదారుల సమస్యలపై నిర్లక్ష్యం వహించరాదని అధికారులకు సూచించారు. అర్జీదారులు

అర్జీదారుల సమస్యలు వింటున్న కలెక్టర్, జాయింట్ కలెక్టర్

తమ అర్జీల సమాచారం కోసం 1100 కాల్ చేసి తెలుసుకోవచ్చని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఓ జి.రామారావు, డ్వామా, డిఆర్డిఎ, మెప్మా, గృహనిర్మాణం పీడీలు పూర్ణిమదేవి, శచిదేవి, కె.సరోజినీ, శ్రీనివాస్, డిఈఓ జి.అప్పారావు నాయుడు, డిఎంహెచ్ఓ డాక్టర్ హైమవతి, జిల్లా ఎక్సైజ్, రవాణా శాఖల అధికారులు వి సుధీర్, జి మనోహర్, జిల్లా సర్వే, భూ రికార్డుల సహాయ సంచాలకులు గోపాల్ రాజా పాల్గొన్నారు.

ఎస్పీ కార్యాలయంలో...

అనకాపల్లి జిల్లా పోలీసు కార్యాలయంలో సోమవారం నిర్వహించిన పిజిఆర్ఎస్‌లో జిల్లా ఎస్పీ తుహిన్ సిన్హా ప్రజల నుండి మొత్తం 55 ఫిర్యాదులను స్వీకరించారు. వాటిలో భూ తగాదాలు- 23, కుటుంబ కలహాలు- 4, మోసం- 1, ఇతర విభాగాలకు చెందినవి -27 ఉన్నాయి. ఈ సందర్భంగా ఎస్పీ తుహిన్ సిన్హా సంబంధిత అధికారులకు ఆదేశిస్తూ "ప్రతి ఫిర్యాదును నిశితంగా పరిశీలించి వాస్తవాలు నిర్ధారించగానే చట్టపరమైన చర్యలు తీసుకోవాలని సూచించారు. 7 రోజుల లోపు విచారణ పూర్తిచేసి తగిన పరిష్కారం చూపాలన్నారు. కార్యక్రమంలో అదనపు ఎస్పీ ఎల్.మోహన రావు, ఎస్సై వెంకన్న సిబ్బంది పాల్గొన్నారు.

ప్రథమ బహుమతి సాధించిన విద్యార్థులను అభినందిస్తున్న దృశ్యం

సాంస్కృతిక పోటీల్లో కొత్తపేట విద్యార్థినులకు ప్రథమ బహుమతి

ప్రజాశక్తి-యలమంచిలి : కాకినాడ 'సంకల్ప' సాంస్కృతిక సంస్థ హైస్కూల్ విద్యార్థినులకు నిర్వహించిన సాంస్కృతిక పోటీల్లో యలమంచిలి కొత్తపేట హైస్కూల్ విద్యార్థినులు ప్రతిభ చూపారు. వీరు ప్రదర్శించిన 'ఆడపిల్ల' నాటిక ప్రథమ బహుమతి సాధించిందని హైస్కూల్ ప్రధానోపాధ్యాయులు వైవి.రమణ తెలిపారు. ఈ పోటీల్లో గెలుపొందిన విద్యార్థినులను సోమవారం హైస్కూల్లో జరిగిన ప్రత్యేక సమావేశంలో ఉపాధ్యాయులంతా అభినందించారు. ఈ సాంస్కృతిక పోటీల్లో విద్యార్థినులు ప్రదర్శించిన 'థింసా' నృత్యం ప్రత్యేక ఆకర్షణగా నిలిచినట్లు కొనియాడారు. పాఠశాలలో చదువుతో పాటు విద్యార్థులకు సృజనాత్మక శక్తిని వెలికి తీసే కార్యక్రమాలు నిర్వహిస్తున్న క్రాఫ్ట్ ఉపాధ్యాయిని అపర్ణను ప్రత్యేకంగా అభినందించారు. కార్యక్రమంలో సంకల్ప ప్రతినిధి బుజ్జి, పాఠశాల పిడి కుందూరు రాజు, శ్రీనివాసరావు, చంద్రశేఖర్, అమరావతి, కిరణ్ కుమార్, రాజేశ్వరి పాల్గొన్నారు.

హెచ్చరిక బోర్డు పెట్టిన రెవెన్యూ అధికారులు

ఆక్రమణకు గురైన గెడ్డవాగులో హెచ్చరిక బోర్డు

ప్రజాశక్తి-సబ్బవరం : మండలంలోని గొల్లలపాలెం రెవిన్యూ పరిధి సర్వే నెంబర్ 249లో ఆక్రమణకు గురైన ప్రభుత్వ గెడ్డవాగు భూమిలో హెచ్చరిక బోర్డు ఏర్పాటు చేసినట్లు స్థానిక ఆర్ఐ బి.వీరయ్య తెలిపారు. ఇక్కడ 69 సెంట్లు గెడ్డ వాగు ఉండగా, గ్రామానికి చెందిన కొంతమంది దురాక్రమణ చేసి షాపింగ్ కాంప్లెక్స్ నిర్మాణం చేపట్టారు. దీంతో రెవెన్యూ అధికారులు సోమవారం ఆ స్థలానికి వెళ్లి ప్రభుత్వ హెచ్చరిక బోర్డులను ఏర్పాటు చేశారు. దీనిపై స్థానిక వీరయ్య స్పందిస్తూ హెచ్చరిక బోర్డులు తొలగిస్తే వారిపై చట్టపరమైన చర్యలు తీసుకొని క్రిమినల్ కేసులు పెడతామని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో విఆర్ఓ దేముడు బాబు, రెవిన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

అక్రమ నిర్మాణం అడ్డగింత

అనకాపల్లి : మండలంలోని గోపాలపురం సర్వే నెంబరు 111లో కొండ పోరంబోకు స్థలంలో కొందరు వ్యక్తులు అక్రమంగా చేపట్టిన నిర్మాణాలను రెవెన్యూ సిబ్బంది అడ్డుకున్నారు. కొందరు వ్యక్తుల ఫిర్యాదు మేరకు రెవిన్యూ ఇన్స్పెక్టర్ శివకుమార్ ఆధ్వర్యాన అక్రమ నిర్మాణ పనులను అడ్డుకొని హెచ్చరిక బోర్డు ఏర్పాటు చేశారు. ప్రభుత్వ భూములను పరిరక్షించాల్సిన బాధ్యత తమపై ఉందని తహశీల్దార్ ఆనంద్‌రావు తెలిపారు.

పేదల భూములు లాక్కుంటే ఆందోళన

బాధితులతో మాట్లాడుతున్న జెడ్‌పిటిసి రాంబాబు

ప్రజాశక్తి-బుచ్చయ్యపేట : పేదల భూములను లాక్కుంటే తాము ఆందోళన చేస్తామని జెడ్పిటిసి దొండా రాంబాబు స్పష్టం చేశారు. మండలంలోని కరక గ్రామానికి చెందిన రైతులు సోమవారం జెడ్‌పిటిసిని కలిసి వినతిపత్రం అందజేశారు. కరకలో సర్వేనెంబర్ 52-4లో 2.11 ఎకరాల ప్రభుత్వ భూమిలో కొన్ని దశాబ్దాలుగా 10 నుండి 15 కుటుంబాలు సాగు చేసుకుంటూ జీవనోపాధి పొందుతున్నట్లు రైతులు తెలిపారు. ఆ భూమిని పంచాయతీ కార్యాలయం నిర్మాణం, ఇళ్ల స్థలాలకు ప్రభుత్వం తీసుకోవడానికి ప్రయత్నం చేస్తున్నాదని పేర్కొన్నారు. దీనికి స్పందించిన జెడ్‌పిటిసి మాట్లాడుతూ బాధిత రైతులకు గతంలో ఆర్డిఓ నుండి పాసు పుస్తకాలు మంజూరయ్యాయని, రాజకీయ ఒత్తిడికి తలొగ్గి అధికారులు దీనిని ప్రజా అవసరాల పేరుతో లాక్కునేందుకు ప్రయత్నిస్తున్నారని తెలిపారు. రైతులు పక్షాన ఆందోళన చేస్తామన్నారు. కార్యక్రమంలో యన్నంశెట్టి నాయుడు, రాజు, సత్తిబాబు, సన్యాసిరావు తదితరులు పాల్గొన్నారు.

జిల్లా అకడమిక్ ఫోరం సమావేశం

మాట్లాడుతున్న డిఇఒ అప్పారావు నాయుడు

ప్రజాశక్తి-కశింకోట : కశింకోట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో సోమవారం జిల్లా అకడమిక్ ఫోరం మొదటి సమావేశం జిల్లా విద్యాశాఖ అధికారి గిడ్డి అప్పారావు నాయుడు అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో ఉన్న అన్ని ప్రభుత్వ ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలలను పర్యవేక్షించి ఆయా పాఠశాలల్లో విద్యా ప్రమాణాలు ఏ విధంగా ఉన్నాయో పరిశీలించాలని సూచించారు. ప్రస్తుతం ఉన్న విద్యార్థుల ప్రమాణాలు, ప్రగతి ఏ విధంగా ఉన్నదో క్షుణ్ణంగా పరిశీలించి ఉపాధ్యాయుల పనితీరు మూల్యాంకన పుస్తకాలు ఏ విధంగా దిద్దుబాటు చేయడం జరుగుతున్నదో చూడాలని ఆదేశించారు. ఉపాధ్యాయుల బోధనలో ఎదుర్కొంటున్న సమస్యలను ఏ విధంగా అధిగమించాలో సూచించారు. ఈ సమావేశంలో సమగ్ర శిక్ష అదనపు పథక సంచాలకులు జయప్రకాష్, జిల్లా ఉప విద్యాశాఖ అధికారి అప్పారావు, ప్రభుత్వ పరీక్షల నిర్వహణ సహాయ సంచాలకులు శ్రీధర్‌రెడ్డి, డిసిఎబి సెక్రటరీ సత్యనారాయణ, ఏపీవో వెంకటేశ్వరరావు, ఉపాధ్యాయ శిక్షణ సంస్థ లెక్చరర్ సునీత, పాఠశాల ప్రధానోపాధ్యాయులు ప్రసాద్, అకడమిక్ ఫోరం సభ్యులు పాల్గొన్నారు.

'ఇండియా ఫస్ట్ లైఫ్ ఇన్సూరెన్స్' 16వ వార్షికోత్సవం

ప్రజాశక్తి-అనకాపల్లి : యూనియన్ బ్యాంకు అనుబంధ సంస్థ ఇండియా ఫస్ట్ లైఫ్ ఇన్సూరెన్స్ సంస్థ 16వ వార్షికోత్సవం స్థానిక యూనియన్ బ్యాంక్ ఉడ్‌పేట శాఖలో నిర్వహించారు. ఈ సందర్భంగా లీడ్ బ్యాంకు మేనేజర్ సత్యనారాయణ, యూనియన్ బ్యాంకు గవరపాలెం చీఫ్ మేనేజర్ లక్ష్మీనారాయణ, మెయిన్ బ్రాంచ్ మేనేజర్ టి.శోభనాద్రి, ఉడ్‌పేట మేనేజర్ ఆడారి గోవిందరావు, తుమ్మపాల మేనేజర్ చిరంజీవి, ఆడారి చంద్రశేఖర్, కాండ్రేగుల హరికృష్ణ, బ్యాంకు ఉద్యోగులను ఆ సంస్థ ఘనంగా సన్మానించింది. ఈ సందర్భంగా బ్రాంచ్ మేనేజర్లు మాట్లాడుతూ ఇన్సూరెన్స్ రంగానికి మంచి రోజులు వచ్చాయని తెలిపారు. ఇండియా ఫస్ట్ లైఫ్ ఇన్సూరెన్స్ అనకాపల్లి ఇన్‌ఛార్జి ఆళ్ల యశోద మాట్లాడుతూ అనకాపల్లిలో ఉన్న నాలుగు బ్రాంచ్ మేనేజర్లు, బ్యాంకు సిబ్బంది తమను ఎంతో ప్రోత్సహించినందుకు వారికి ధన్యవాదాలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఉడ్‌పేట, గవరపాలెం, మెయిన్ బ్రాంచ్, తుమ్మపాల బ్రాంచ్ సిబ్బంది పాల్గొన్నారు.

టెన్త్ పరీక్షా కేంద్రాల పరిశీలన

ప్రజాశక్తి-పాయకరావుపేట : పట్టణంలోని పదో తరగతి పరీక్షా కేంద్రాలను అనకాపల్లి జిల్లా పరీక్షల నిర్వహణ అసిస్టెంట్ కమిషనర్ శ్రీధర్‌రెడ్డి సోమవారం పరిశీలించారు. పట్టణంలోని శ్రీచైతన్య స్కూల్, శ్రీప్రకాష్ విద్యానికేతన్, కన్నోస్సా ఇంగ్లీష్ మీడియం స్కూల్, గవర్నమెంట్ హైస్కూల్‌ను సందర్శించారు. ఈ కార్యక్రమంలో హెచ్ఎం ప్రసాద్, ఎంఈవో-1 గాంధీ, ఎంఈవో-2 రమేష్ పాల్గొన్నారు.

ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యం

ప్రజాశక్తి-అచ్యుతాపురం : గ్రామాలలో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించడమే ధ్యేయంగా టిడిపి పనిచేస్తుందని ఎంపీటీసీ సభ్యుడు పల్లి వెంకటేశ్వరరావు అన్నారు. మండలంలోని దొప్పర్ల గ్రామంలో సోమవారం ఆయన గ్రామస్తులు ఎదుర్కొంటున్న భూ సమస్యలు, పింఛన్లు, రేషన్ కార్డులు, మురుగునీటి కాలువలు తదితర సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సమస్యలను సంబంధిత శాఖ మంత్రులకు అధికారులకు తెలుగుదేశం పార్టీ అధిష్టానానికి పిజిఆర్ఎస్‌లో నమోదు చేశారు. కార్యక్రమంలో పిఎసిఎస్ డైరెక్టర్ రండి బాబురావు, టిడిపి గ్రామ శాఖ అధ్యక్షులు కొల్లి వరహాలరావు, అచ్యుతాపురం మండల కోశాధికారి ముచ్చు గంగరాజు, టిడిపి సీనియర్ నాయకురాలు కొల్లి వెంకటలక్ష్మి, కొల్లి చిట్టిబాబు, పల్లి ప్రసాద్‌రావు తదితరులు పాల్గొన్నారు.

సమస్యలు తెలుసుకుంటున్న ఎంపిటిసి వెంకటేశ్వరరావు

ప్రత్యేక అవసరాలు పిల్లల దత్తతను ప్రోత్సహించాలి

ప్రజాశక్తి-అనకాపల్లి : ప్రత్యేక అవసరాలు గల పిల్లలను గుర్తించి వారిని దత్తత తీసుకునే విధంగా ప్రోత్సహించాలని జాతీయ దత్తత మిషన్ కోఆర్డినేటర్ కె.మేరీ సువార్త అన్నారు. మహిళా, శిశు సంక్షేమ శాఖ, జిల్లా బాలల సంరక్షణ విభాగం ద్వారా "జాతీయ దత్త అవగాహన మాసోత్సవాల్లో" భాగంగా సోమవారం విజయరామరాజుపేట అంగన్వాడీ కేంద్రంలో ఈ కార్యక్రమం నిర్వహించారు. ఈ దత్తత మాసం నవంబర్ 1 తేదీ నుండి 30 వరకు అనేక రకాల కార్యక్రమాలు చేపట్టడం జరుగుతుందని చెప్పారు. కార్యక్రమంలో అనకాపల్లి ఐసిడిఎస్ ప్రాజెక్ట్ సిడిపిఓ, ప్రభావతి, జిల్లా బాలల సంరక్షణ అధికారి రమేష్, బాలల రక్షణ అధికారి కెఎల్.మనోహర్, కౌన్సిలర్ భాను, సామాజిక కార్యకర్తలు రూప, రంజిత, శ్రీదేవి మేనేజర్, అంగన్వాడి కార్యకర్తలు, మహిళా పోలీసులు పాల్గొన్నారు.

రేషన్ డిపోలో తనిఖీలు

ప్రజాశక్తి-బుచ్చయ్యపేట : మండలంలోని చింతపాక గ్రామ రేషన్ డిపోలో సివిల్ సప్లై అధికారులు సోమవారం తనిఖీలు చేశారు. ఈ తనిఖీల్లో లబ్ధిదారులకు ఇవ్వగా 110 కేజీల బియ్యం అదనంగా ఉన్నట్లు అధికారులు గుర్తించారు. దీంతో సదరు డీలర్ దండి మంగపై కేసు నమోదు చేశారు. ఈ రేషన్ డిపో బాధ్యతలను సీతయ్యపేట రేషన్ డీలర్ బొబ్బిలి నాగమణికి అప్పగించారు.

శ్రీచైతన్యలో నాసా ప్రాజెక్టు కిట్లు పంపిణీ

ప్రజాశక్తి-పాయకరావుపేట : స్థానిక శ్రీచైతన్య స్కూల్‌లో సోమవారం ప్రతిష్టాత్మక నాసా ప్రాజెక్టు కిట్లు పంపిణీను మండల విద్యాశాఖాధికారి గాంధీ చేతుల మీదుగా పంపిణీ చేశారు. విద్యార్థులు శాస్త్ర పరిజ్ఞానంపై అవగాహన పెంచుకొని భావి భారత శాస్త్రవేత్తలుగా ఎదగాలని సూచించారు. తమ సృజనాత్మకతను ఉపయోగించి మంచి ప్రాజక్టులు తయారు చేసి నాసా సెలక్షనుకు ఎంపిక కావాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో ఏజిఎం సురేష్, ఆర్ఐ గోపినాథ్, ప్రిన్సిపల్ మాణిక్యాలరావు, అకడమిక్ కో-ఆర్డినేటర్ పట్నాయక్, సీ బ్యాచ్ ఇన్‌చార్జ్ లక్ష్మీకాంతం, వైస్ ప్రిన్సిపల్ రమణ, డీన్ మనీష్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

నాసా ప్రాజెక్టు కిట్లు పంపిణీ చేస్తున్న దృశ్యం

స్థానిక సంస్థల ఎన్నికల్లో విజయం సాధించాలి



ప్రమాణ స్వీకారం చేస్తున్న వివిధ కమిటీలకు ఎంపికైన నాయకులు

ప్రజాశక్తి-అచ్యుతాపురం : రానున్న స్థానిక సంస్థల ఎన్నికలలో విజయం సాధించాలని రాష్ట్ర రహదారులు అభివృద్ధి కార్పొరేషన్ ఛైర్మన్ ప్రగడ నాగేశ్వరరావు కార్యకర్తలకు పిలుపునిచ్చారు. అచ్యుతాపురంలో సోమవారము టిడిపి కార్యకర్తల వనభోజన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా మండల, క్లస్టర్, యూనిట్, బూత్, గ్రామ కమిటీల ఇన్చార్జిల చేత ప్రమాణ స్వీకారం చేయించారు. ముందుగా పార్టీ వ్యవస్థాపకులు నందమూరి తారక రామారావు చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. పార్టీ జెండాను మాజీ ఎంపీ పప్పుల చలపతిరావు ఆవిష్కరించారు. నూతనంగా పలు కమిటీలకు ఎంపికైన వారిని చలపతిరావు, ప్రగడ నాగేశ్వరరావు ఘనంగా సత్కరించారు. పార్టీకి అంకితభావంతో పనిచేస్తామని ప్రతిజ్ఞ చేశారు. ఈ కార్యక్రమంలో టిడిపి రాష్ట్ర కార్యదర్శి రాజాన రమేష్ కుమార్, జెడ్పి మాజీ ఛైర్పర్సన్ లాలం భవాని భాస్కర్, రాష్ట్ర యాదవ కార్పొరేషన్ డైరెక్టర్ దూళీ రంగనాయకులు, గవర కార్పొరేషన్ డైరెక్టర్ భీమరశెట్టి శ్రీనివాసరావు, కాపు కార్పొరేషన్ డైరెక్టర్ మామిడి శివ అప్పారావు, మాదిగ కార్పొరేషన్ డైరెక్టర్ డొక్కా నాగభూషణం, పార్టీ మండల అధ్యక్షులు పేల తులసి రాము, తెలుగు మహిళ జిల్లా అధ్యక్షురాలు ఆడారి మంజు, నాయకులు మెరుగు బాపు నాయుడు, కర్రి ఆదిబాబు పాల్గొన్నారు.

దుస్తులు పంపిణీ చేస్తున్న కార్పొరేటర్ రౌతు శ్రీనివాస్

శానిటేషన్ సిబ్బందికి దుస్తుల పంపిణీ

ప్రజాశక్తి-పరవాడ : గ్రేటర్ విశాఖ 79వ వార్డు పరిధి ప్రశాంతి నగర్ సచివాలయానికి చెందిన శానిటేషన్ సిబ్బందికి జీవీఎంసీ నిధులతో దుస్తులను స్థానిక కార్పొరేటర్ రౌతు శ్రీనివాస్ సోమవారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ సిబ్బంది కొరత సమస్యను జివిఎంసి కమిషనర్ దృష్టికి తీసుకెళ్లానని, త్వరలోనే అవసరమైన సిబ్బంది నియామకాలు జరుగుతాయని ఆశాభావం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో వార్డు అధ్యక్షులు కరణం జగదీష్, సింగిడి సింహాచలం, మాడిసా వెంకట్రావు, ప్రవీణ్, కిరణ్, తాతారావు, రామానాయుడు, కూటమి నాయకులు, శానిటరీ ఇన్స్పెక్టర్ రాంబాబు పాల్గొన్నారు.

అనారోగ్యంతో బాధపడుతున్న స్నేహితునికి ఆర్థిక సాయం

ప్రజాశక్తి-పరవాడ : మండలంలోని వాడచీపురుపల్లి జెడ్పీ హైస్కూల్ 2005-06 బ్యాచ్ పదో తరగతి విద్యార్థులు అనారోగ్యంతో బాధపడుతూ జీవనోపాధి లేని పరిస్థితుల్లో ఉన్న తమ తోటి స్నేహితుడు కూండ్రపు నాగేశ్వరరావుకు ఆర్థిక సాయం అందజేశారు. నాయుడుపాలెం పంచాయతీ, కొండవానిపాలెం గ్రామానికి చెందిన నాగేశ్వరరావు కొంతకాలంగా అనారోగ్యంతో ఇంటికే పరిమితమైపోయాడు. ఈ విషయాన్ని తోటి స్నేహితులు తెలుసుకుని ఆదివారం ఆయన స్వగృహానికి వెళ్లి పరామర్శించారు. ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకొని, తామంతా అండగా నిలుస్తామని ధైర్యం చెప్పారు. తమలో ప్రతివారు తలోకొంత సహకారం అందించి మొత్తం రూ.58వేలు సేకరించి నాగేశ్వరరావు కుటుంబ సభ్యులకు అందజేశారు. కార్యక్రమంలో సమ్మంగి అప్పలరాజు, వియ్యపు అప్పలనాయుడు, చీపురుపల్లి హరిబాబు, పైలా రోహిత్, కోరంగి గణేష్, కూండ్రపు ముత్యాలు, చీపురుపల్లి నేస్తాలు, సబ్బవరపు నరేష్, ఒలిశెట్టి ప్రసాద్, లక్ష్మణరావు తదితరులు పాల్గొన్నారు.

కార్మికులకు ఈ-శ్రమ కార్డులు పంపిణీ

ప్రజాశక్తి-చోడవరం : చోడవరం కార్మికశాఖ కార్యాలయంలో సోమవారం కార్మికులకు ఈ-శ్రమ కార్డులను సహాయ కార్మిక శాఖ అధికారి సూర్యనారాయణ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భవన నిర్మాణ కార్మికులతో పాటు ఉపాధి హామీ కార్మికులు, ఏ రంగంలోనే పనిచేసే కార్మికులందరూ ఈ శ్రమ కార్డులకు అర్హులని పేర్కొన్నారు. తమ కార్యాలయ పరిధిలోని సబ్బవరం, కె.కోటపాడు, దేవరాపల్లి, వి.మాడుగుల, బుచ్చియ్యపేట, రావికమతం, చీడికాడ మండలాల్లోని భవన నిర్మాణ కార్మికులు, ఉపాధి హామీ కార్మికులు ఈ శ్రమ గుర్తింపు కార్డుల కోసం దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఈ కార్డుల కోసం యూనియన్ బ్యాంకులో రూ.110 చెల్లించి లేబర్ ఆఫీసుకు సమర్పించాలన్నారు.

గ్రామాల్లో పారిశుధ్య పనుల పరిశీలన

ప్రజాశక్తి-యస్.రాయవరం : మండలంలోని పెద గుమ్ములూరు, తిమ్మాపురం, ధర్మవరం గ్రామాల్లో పారిశుధ్య పనులను డిప్యూటీ ఎంపిడిఒ బంగారు సత్యనారాయణ సోమవారం పరిశీలించారు. ప్రతి ఇంటికి వెళ్లి వద్దకు పంచాయతీ క్లాప్ మిత్రలు వెళ్ళి తడి, పొడి చెత్తలను వేర్వేరుగా సేకరించడాన్ని పరిశీలించారు. పారిశుధ్య కార్యక్రమాల అమలులో ప్రజలను స్థానిక ప్రజా ప్రతినిధులను భాగస్వామ్యం చేయడం ద్వారా మెరుగైన ఫలితాలు సాధించవచ్చని ఆయన తెలిపారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శులు, సచివాలయం సిబ్బంది పాల్గొన్నారు.

చెత్త సేకరణను పరిశీలిస్తున్న డిప్యూటీ ఎంపిడిఒ సత్యనారాయణ

పోలీసుల వాహన తనిఖీలు

ప్రజాశక్తి-యలమంచిలి : ఎప్పుడూ రద్దీగా ఉంటే రేల్వే స్టేషన్రోడ్డులో సోమవారం టౌన్ ఎస్ఐ సావిత్రి ఆధ్వర్యంలో పోలీసులు తనిఖీలు నిర్వహించారు. ద్విచక్ర వాహనాలను ఆపి లైసెన్సులు ఇతర అనుమతులు గురించి ప్రశ్నించారు. నిర్లక్ష్యంగా అతి స్పీడుగా బైక్ నడిపేవారిని గుర్తించి విచారించారు. లైసెన్సు లేని మైనర్లకు కౌన్సిలింగ్ నిర్వహించారు. వారికి వాహనాలు ఇచ్చిన వాహన యజమానులను హెచ్చరించారు. మైనర్లు, అతి వేగంగా వాహనాల నడిపే వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని ఎస్ఐ సావిత్రి తెలిపారు. కార్యక్రమంలో ఎఎస్ఐ చెల్లారావు, పలువురు కానిస్టేబుళ్ళు పాల్గొన్నారు.

ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో స్పాట్ అడ్మిషన్లు

ప్రజాశక్తి-సబ్బవరం : స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో స్పాట్ అడ్మిషన్లు ఈనెల 17 నుండి 20వరకు నిర్వహిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ బి శంకర్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎవరైనా ప్రవేశం పొందాలంటే నేరుగా కళాశాలకు వచ్చి డిగ్రీలో ప్రవేశం పొందవచ్చునన్నారు. బి.యస్సి కంప్యూటర్ సైన్స్ ఒకటి, బియస్సి బోటనీ -31, బి.కాం కంప్యూటర్ అప్లికేషన్ -07, బిఎ చరిత్ర -04 సీట్లు మిగిలి ఉన్నాయని పేర్కొన్నారు. విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

సదస్సులో పాల్గొన్న జూనియర్ సివిల్ జడ్జి రమేష్ తదితరులు

వృద్ధాశ్రమంలో న్యాయ అవగాహనా సదస్సు

ప్రజాశక్తి-యలమంచిలి టౌన్ : పట్టణంలోని ప్రేమసమాజం వృద్ధాశ్రమం, అనాధాశ్రమంలో యలమంచిలి అదనపు జూనియర్ సివిల్ జడ్జి కె.రమేష్ ఆధ్వర్యంలో సోమవారం న్యాయ అవగాహనా సదస్సు నిర్వహించారు. వృద్ధులు వివరాలు, ఆరోగ్యం గురించి తెలుసుకొని వారికి న్యాయ చట్టాలు గురించి వివరించారు. ఏదైనా న్యాయ సహాయం కావాలంటే తమను సంప్రదించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఏజిపి ద్వారపురెడ్డి వెంకటరావు, న్యాయవాదులు బి.హరి శంకర్, పీవీ రమణ, పిఎల్ వి ప్రసాద్, జ్యుడీషల్ సిబ్బంది, ప్రేమసమాజం సిబ్బంది పాల్గొన్నారు.

ఏపిఎన్జిఒ రాష్ట్ర అధ్యక్షుడిని కలిసిన అవుట్ సోర్సింగ్ ఉద్యోగులు

ప్రజాశక్తి-అనకాపల్లి : అనకాపల్లిలో సోమవారం పర్యటించిన ఏపీఎన్జీవో రాష్ట్ర అధ్యక్షులు అలపర్తి విద్యాసాగర్ రావును ఉమ్మడి విశాఖ జిల్లా గవర్నమెంట్ ఔట్సోర్సింగ్ ఎంప్లాయిస్ అసోసియేషన్ ప్రతినిధులు మర్యాదపూర్వకంగా కలిశారు. రాష్ట్రంలో ఔట్సోర్సింగ్ ఉద్యోగులు ఎదుర్కొంటున్న సమస్యలపై వినతి పత్రం అందజేశారు. తమ సమస్యలను రాష్ట్ర ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లి పరిష్కార మార్గం చూపాలని విద్యాసాగర్ను కోరారు. కార్యక్రమంలో అసోసియేషన్ విశాఖ జిల్లా అధ్యక్షులు రాంపిల్ల సతీష్, ప్రధాన కార్యదర్శి హరికృష్ణ, ఉరుకూటి నూకరాజు, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

గ్రంథాలయాల్లో పలు పోటీలు

కశింకోట : తాళ్లపాలెంలో వ్యాసరచన పోటీల్లో పాల్గొన్న విద్యార్థులు

ప్రజాశక్తి - విలేకర్ల యంత్రాంగం

58వ గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా అనకాపల్లి, విశాఖ జిల్లాలోని పలు గ్రంథాలయాల్లో సోమవారం విద్యార్థులకు వివిధ రకాల పోటీలు నిర్వహించారు.

కశింకోట : మండలంలోని తాళ్ళపాలెం శాఖా గ్రంథాలయంలో సోమవారం పాఠశాల, జూనియర్ కళాశాల విద్యార్థులకు గ్రంథాలయాలు- వాటి ప్రాముఖ్యత, పర్యావరణ పరిరక్షణ-విద్యార్థుల బాధ్యత తదితర అంశాలపై వ్యాసరచన పోటీలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో గాయత్రి స్కూల్ సైన్స్ ఉపాధ్యాయులు టి.తేజ, సిహెచ్.హరిచందన, గ్రంథాలయాధికారి కె.జగన్నాథం పాల్గొన్నారు.

కోటవురట్ల : స్థానిక శాఖ గ్రంథాలయంలో వ్యాసరచన పోటీలు నిర్వహించారు, ప్రభుత్వ పాఠశాల విద్యార్థులు ఇందులో పాల్గొన్నారు. విజేతలకు ముగింపు రోజున బహుమతులు అందజేస్తామని గ్రంథాలయ అధికారి అప్పలనాయుడు తెలిపారు.

కె.కోటపాడు : మండలంలోని చౌడువాడ శాఖ గ్రంథాలయం ఆధ్వర్యాన జిల్లా పరిషత్ హైస్కూల్, ఎలిమెంటరీ స్కూల్ విద్యార్థులకు క్విజ్ పోటీలు నిర్వహించారు. కార్యక్రమంలో గ్రంథాలయ అధికారి ఎం.పద్మావతి, ఉపాధ్యాయులు విద్యార్థులు పాల్గొన్నారు.

పాయకరావుపేట : గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా విద్యార్థులకు యోగా పోటీలు నిర్వహించారు. సీనియర్స్ విద్యార్థులకు చైతన్య టెక్నో స్కూల్లో వాతావరణ కాలుష్యంపైనా, జూనియర్స్కు గౌతమ్ మోడల్ స్కూల్లో రహదారులు-చిహ్నలపై అన్న అంశాలపై డ్రాయింగ్ పోటీలు ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు గ్రంథాలయ ఇన్చార్జి వామా లక్ష్మణరావు పాల్గొన్నారు.

అనకాపల్లి : తుమ్మపాల శాఖా గ్రంథాలయంలో లైబ్రేరియన్ ఎం.పద్మావతి అధ్యక్షతన విశ్రాంత ఇంజనీర్ ఆళ్ల గోవిందరావు కన్వీనర్గా 'రావిశాస్త్రి సాహిత్య సమాలోచన' కార్యక్రమం నిర్వహించారు. ముందుగా గ్రంథాలయ పితామహుల చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. కొంతలం జెడ్పి హైస్కూల్ హెచ్ఎం ఎ.రవి శంకర్ "నేటి హీన సంస్కృతి- మనం చూపే పరిష్కారం" అనే అంశంపై ప్రబోధాత్మక ఉపన్యాసం అందించారు. కార్యక్రమంలో సింహచలం యాదవ్, కేవీ సూర్యనారాయణ, ఉపాధ్యాయులు ఆనంద్, జగన్, ఏవీవీ సత్యనారాయణ, అప్పారావు, నర్సింగరావు పాల్గొన్నారు.

నర్సీపట్నం : గ్రంథాలయం వారోత్సవాల్లో భాగంగా సోమవారం లైబ్రేరియన్ దమయంతి విద్యార్థులకు ఆధ్వర్యంలో చిత్రలేఖనం పోటీలు నిర్వహించారు, అనంత ఉమాశంకర్ తను స్వయంగా రచించిన మహేష్ శతకంలో కొన్ని కవితలను వినిపించారు, కార్యక్రమంలో జెడ్పి హైస్కూల్ హెచ్ఎం నాగవల్లిక , శ్రీనివాసు జి రామన్న పాల్గొన్నారు.

నక్కపల్లి : చినదొడ్డిగల్లు గ్రంథాలయ శాఖలో సోమవారం గ్రంథాలయ అధికారి జనార్ధన ఆధ్వర్యంలో విద్యార్థులకు వ్యాసరచన పోటీలు నిర్వహించారు. సీనియర్లకు సెల్ఫోన్ ఆవశ్యకతపైనా, జూనియర్ల గ్రంథాలయాల ఆవశ్యకతపై వ్యాసరచన పోటీలు నిర్వహించారు. హైస్కూల్ హెచ్ఎం బాలాజీ, ప్రాథమిక పాఠశాల హెచ్ఎం పి నాగేశ్వరరావు, సామాజిక కార్యకర్త నానాజీ పాల్గొన్నారు.

కె.కోటపాడు : చౌడువాడలో క్విజ్ పోటీల్లో పాల్గొన్న దృశ్యం

భీమునిపట్నం : గ్రంథాలయాల వల్ల కలిగే ఉపయోగాలు, వాటి ప్రాధాన్యతపై స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో విద్యార్థులకు వ్యాసరచన, వక్తృత్వ, క్విజ్ పోటీలు నిర్వహించారు. గెలుపొందిన వారికి బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపల్ పి.రాంప్రసాద్, అధ్యాపకులు పి.దుర్గాప్రసాదరావు, బి.సింహాద్రప్పడు, పాల్గొన్నారు.

స్థానిక శాఖా గ్రంథాలయంలో జరిగిన కార్యక్రమంలో లైబ్రేరియన్ మహేష్, మాజీ కౌన్సిలర్లు గంటా నూకరాజు, మైలపల్లి లక్ష్మణ రావు పాల్గొన్నారు

పెందుర్తి : పెందుర్తి శాఖా గ్రంథాలయంలో చిత్రలేఖన పోటీలు నిర్వహించారు. ఈ పోటీలో యూనిక్ ఇంగ్లీష్ మీడియం హైస్కూల్ నుండి 50 మంది, లిటిల్ ఫ్లవర్స్ ఇంగ్లీష్ మీడియం హైస్కూల్ నుండి 68 మంది విద్యార్థులు పాల్గొన్నారు. జాతీయ జెండా చిత్రపటాన్ని ఆసక్తిగా చిత్రించారు. ఈ కార్యక్రమంలో యూనిక్ స్కూల్ ప్రధానోపాధ్యాయులు కె.ఆదినారాయణ, లిటిల్ ఫ్లవర్ పాఠశాల ప్రధానోపాధ్యాయులు కెఎస్.ఎన్.రాజు, గ్రంథాలయాధికారి బి.చంద్రకళ పాల్గొన్నారు.

ములగాడ : మల్కాపురం శాఖా గ్రంథాలయంలో చిన్నారులకు చిత్రలేఖన పోటీలను నిర్వహించారు. ఈ కార్యక్రమంలో గ్రంథాలయాధికారి వి.అజయ్కుమార్, జాతీయ సేవా పథకం జిల్లా నోడల్ అధికారి ఇపిఎస్. భాగ్యలక్ష్మి పాల్గొన్నారు.

ఆనందపురం : గ్రంథాలయంలో ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు చిత్రలేఖనం, మ్యూజికల్ చైర్ పోటీలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో గ్రంథాలయాధికారి బివిఎస్.అప్పారావు, మాజీ సర్పంచ్ శ్రీనాథ్ నారాయణరావు, ప్రధానోపాధ్యాయులు పైడిరాజు పాల్గొన్నారు.

సీతమ్మధార : గ్రంథాలయ వారోత్సవాల సందర్భంగా అభ్యుదయ రచయితల సంఘం ఆధ్వర్యాన రచయితల అంతరంగం ఆవిష్కరణ కార్యక్రమం నిర్వహించారు. అరసం రాష్ట్ర కార్యదర్శి ఉప్పల అప్పలరాజు అధ్యక్షతన జరిగిన సభలో ముందుగా అజీజ్ రచించిన అల్లూరి సత్యనారాయణ రాజు జీవిత చరిత్ర నవలను ప్రముఖ సాహితీ వేత్త డాక్టర్ డివి.సూర్యారావు ఆవిష్కరించారు. కవిరెడ్డి రామకృష్ణ తనపై వంగపండు ప్రసాద్ ప్రభావం ఉందని తాను రచించిన జానపద గేయాలను ఆలపించారు. ఈ కార్యక్రమంలో హనుమంతరావు, పెబ్బిలి హైమావతి బివి.అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

కుష్టువ్యాధిపై అప్రమత్తంగా ఉండాలి

సర్వేపై ప్రజలకు అవగాహన కల్పిస్తున్న సర్పంచ్ సూర్యకుమారి

ప్రజాశక్తి- రావికమతం: కుష్టు వ్యాధిపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి, అప్రమత్తంగా ఉండాలని కొత్తకోట పిహెచ్‌సి వైద్యాధికారిని డాక్టర్ సురేఖ అన్నారు. సోమవారం పిహెచ్‌సిలో కుష్టువ్యాధిపై ఎల్‌సిడిసి సర్వే బ్యానరును ఆవిష్కరించారు. అనంతరం అవగాహన సదస్సులో మాట్లాడుతూ కొత్తకోట పిహెచ్‌సి పరిధిలోని అన్ని గ్రామాల్లో కుష్టువ్యాధిపై ఇంటింటా సర్వేకు 48 టీములు ఏర్పాటు చేశామన్నారు. ఆయా బృందాలు ఇంటింటికీ వెళ్లివ్యాధి లక్షణాలపై ప్రజలకు అవగాహన కల్పించి, అనుమానితులను గుర్తిస్తారన్నారు. వారికి వ్యాధి నిర్ధారణ పరీక్షలు చేయించి, సత్వరమే తగు వైద్యం అందించడం ద్వారా అంగవైకల్యం రాకుండా కాపాడడమే సర్వే లక్ష్యమన్నారు. కార్యక్రమంలో ఆరోగ్యవిస్తరణాధికారి పాతాళ రామారావు, వైద్య సిబ్బంది ఉన్నారు.

కుష్టువ్యాధి సర్వేకు సహకరించాలి

కుష్టువ్యాధిపై సర్వేకు అందరూ సహకరించాలని సర్పంచ్ దాసరి సూర్య కుమారి అన్నారు. సోమవారం కవగుంటలో అవగాహన సదస్సు నిర్వహించారు. రావికమతం పిహెచ్‌సి సిబ్బంది ఇంటింటికీ వచ్చి సర్వే చేస్తారని, వారికి సమాచారమివ్వడం ద్వారా కుష్టువ్యాధి రాకుండా ముందుగానే తగు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు.సర్వే బృందం వ్యాధి లక్షణాలను తెలియజెప్పి వివరాలను సేకరిస్తుందని, వారికి సహకరించాలని కోరారు.కార్యక్రమంలో ఎఎన్ఎం ప్రభ, ఆశా రాము, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

డ్వాక్రా రుణాలను సద్వినియోగం చేసుకోండి

ప్రజాశక్తి - రావికమతం: : డ్వాక్రా మహిళలను లక్షాధికారులను చేయడమే ప్రభుత్వ ధ్యేయమని, దీనికి నిర్దేశించిన ఉన్నతి పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని వెలుగు ఎపిఎం ఈశ్వరరావు అన్నారు. సోమవారం మండల కేంద్రంలో డ్వాక్రా సంఘ సభ్యులతో సమావేశంలో మాట్లాడుతూ ఎస్‌సి, ఎస్‌టి డ్వాక్రా మహిళలకు ఉన్నతి పథకం ద్వారా వడ్డీ లేని రుణాలను అందిస్తామన్నారు. మండలానికి రూ.1.62 కోట్లు ఉన్నతి రుణాల మంజూరు లక్ష్యంకాగా, ఇప్పటివరకు 85 మందికి రూ.42 లక్షలు అందించామన్నారు. అర్హత కలిగినఎస్‌సి, ఎస్‌టి డ్వాక్రా సంఘ సభ్యులు ఈ పథకాన్ని వినియోగించుకోవాలన్నారు. ప్రతినెలా రుణవాయిదాల రికవరీ సక్రమంగా జరగాలన్నారు. డ్వాక్రా సంఘ సభ్యులు ఉన్నతి, శ్రీనిధి, సిఐఎఫ్, బ్యాంకు లింకేజీ రుణాలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు.కార్యక్రమంలో సిబ్బంది, సంఘ సభ్యులు పలువురు పాల్గొన్నారు.

రుణాల గోల్‌మాల్‌పై నిరసన

తీసుకోని అప్పులకు బ్యాంకు నోటీసులపై డ్వాక్రా మహిళల ఆందోళన

వెలుగు కార్యాలయం వద్ద బ్యాంకు నోటీసులు చూపి మహిళల ఆందోళన

ప్రజాశక్తి -మాడుగుల : తాము తీసుకోని రుణాలను తిరిగి చెల్లించాలంటూ బ్యాంకర్ల నోటీసులు ఇవ్వడంపై డ్వాక్రా మహిళలు ఆగ్రహం వ్యక్తం చేశారు. సోమవారం సాయంత్రం స్థానిక వెలుగు కార్యాలయం ఎదుట నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా పలువురు డ్వాక్రా సంఘాల మహిళలు మాట్లాడుతూ మండలంలోని అవురువాడ, కింతలి పంచాయతీల పరిధిలోని పలు డ్వాక్రా గ్రూపు సభ్యులకు తాము తీసుకోని రుణాలను చెల్లించాలంటూ మాడుగుల యూనియన్ బ్యాంక్, ఎపిజిబి, ఇండియన్ బ్యాంక్ నుంచి నోటీసులు అందాయని మహిళలు మండిపడ్డారు. డ్వాక్రా స్వయం సహాయక సంఘాలకు రుణాలిచ్చే సమయంలో ఆయా సంఘాల అధ్యక్షులు, సెక్రటరీలతోపాటు సభ్యులందరూ ఉంటే గానీ రుణాలు ఇచ్చే పరిస్థితి లేనప్పటికీ, తమ పేరిట ఎవరు రుణాలు తీసుకున్నారో తేల్చాలని వ నిలదీశారు. అవురువాడ, కింతలి పంచాయతీల పరిధిలో రూ.30లక్షల నుంచి రూ.50 లక్షల వరకు రుణాల గోల్‌మాల్ జరిగిందని, కార్యాలయ సిబ్బందే దీనికంతటికీ కారణమని మహిళాసంఘాల సభ్యులు మండిపడ్డారు. బ్యాంకర్లు ఇచ్చిన నోటీసులను స్థానిక ఎపిఎమ్‌కు చూపించి, వాటిపై నిజాలేంటో నిగ్గుతేల్చాలని నిలదీశారు. తాము తీసుకోని రుణాలకు నోటీసులు ఇవ్వడమే కాకుండా, చెల్లించకుంటే ఇళ్లకు తాళాలు వేస్తామని బ్యాంకర్లు హెచ్చరిస్తున్నారని,ఈ వ్యవహారమేంటో తేలకపోతే తామే వెలుగు కార్యాలయానికి తాళాలు వేస్తామంటూ హెచ్చరించారు. రుణాల గోల్‌మాల్ వ్యవహారానికి సంబంధించి ఆధారాలను తమకు చూపించాలని డిమాండ్ చేశారు. దీనిపై ఎపిఎం రమణకుమారి వద్ద ప్రస్తావించగా, డ్వాక్రా సంఘాలకు రుణాలకు సంబంధించి అక్రమాలు జరిగినట్లు ప్రాథమికంగా గుర్తించామని, దీనిపై సమగ్ర పరిశీలన అనంతరం పూర్తి వివరాలను వెల్లడిస్తామన్నారు.

ఉక్కు కార్మికులపై చంద్రబాబు వ్యాఖ్యలు దుర్మార్గం

కలెక్టరేట్ ఎదుట నిరసన వ్యక్తం చేస్తున్న ఐఎఫ్‌టియు నేతలు

ప్రజాశక్తి-విశాఖకలెక్టరేట్: విశాఖ స్టీల్‌ప్లాంట్ కార్మికులు పనిచేయకుండా జీతాలు తీసుకుంటున్నారని బాధ్యత కలిగిన ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అనడం సరికాదని, ఈ వ్యాఖ్యలను వెనక్కి తీసుకోవాలని లేని పక్షంలో పెద్ద ఎత్తున పోరాటం చేపడుతామని ఐఎఫ్‌టియు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎం. వెంకటేశ్వర్లు హెచ్చరించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్న కార్మిక వ్యతిరేక విధానాలను నిరసిస్తూ సోమవారం జిల్లా కలెక్టరేట్ ఎదుట నిరసన తెలిపారు. అనంతరం కలెక్టర్‌కు వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా వెంకటేశ్వర్లు మీడియాతో మాట్లాడుతూ, కార్మికుల ఉపాధి భద్రతను హరిస్తూ పని గంటలు పెంచుతూ కార్మికవర్గంపై కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నిర్ణయాలు చేయడం దుర్మార్గం అన్నారు. నాలుగు లేబర్ కోడ్స్‌ను రద్దు చేయాలని కోరారు. 8 గంటల పనివిధానాన్ని ఓటితో కలిపి 12 గంటల పనిదినంగా చట్టాలు మార్చడం సరికాదన్నారు. ఈ ఏడాది సెప్టెంబర్ 19న అసెంబ్లీలో చంద్రబాబు ప్రభుత్వం ఆమోదించిన జివోను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. 67 షెడ్యూల్డ్ రంగాల కార్మికులకు కనీస వేతనం రూ.26 వేలకు పెంచాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో యూనియన్ జిల్లా అధ్యక్షురాలు పి.లక్ష్మి, ఉపాధ్యక్షులు ఎం. తిరుపతిరావు తదితరులు పాల్గొన్నారు.

ఇళ్లు, స్థలాల మంజూరుకు వినతి

తహశీల్దార్‌కు వినతిపత్రం ఇస్తున్న సిపిఎం నేతలు

ప్రజాశక్తి - రావికమతం: చీమలపాడు పంచాయతీ కొండశిఖర గ్రామంలో పివిటిజి కొందు ఆదివాసి గిరిజనులకు కొండకింద భాగంలో ఇళ్ల స్థలాలు మంజూరు చేయాలని సిపిఎం జిల్లా కార్యవర్గ సభ్యుడు కె.గోవిందరావు డిమాండ్ చేశారు. సోమవారం స్థానిక తహశీల్దార్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా గోవిందరావు మాట్లాడుతూ చీమలపాడు పంచాయతీ కొండ శిఖర కొందు ఆదివాసి గిరిజన కుటుంబాలు దట్టమైన అడవి కొండల మధ్య జీవనం సాగిస్తున్నారన్నారు . ఈ గ్రామాలకు వైద్య, విద్యా సౌకర్యం అందుబాటులో లేకపోవడంతో అనారోగ్యం వస్తే డోలు కట్టుకొని మూడు కిలోమీటర్లు కొండ దిగి రావలసిన పరిస్థితి నెలకొందన్నారు. ఇటువంటి పరిస్థితుల్లో తమకు కొండ కింది భాగంలో ఇల్లు స్థలాలు ఇప్పించాలని కోరుతున్నారు. 2024లో గ్రామంలో రెండిళ్ల అగ్ని ప్రమాదానికి బూడిదైతే, అప్పట్లో అధికారులు పట్టించుకోలేదన్నారు. ప్రసార మాధ్యమాలు ద్వారా తెలుసుకున్న కొందరు దాతలు కట్టుబట్టలు అందజేసినా, అధికారులకు ప్రభుత్వపరంగా కనీసం కన్నెత్తి చూడలేదన్నారు. నేటికీ పూరిగుడిసెల్లోనే జీవనం సాగిస్తున్న వీరంతా ఎండావానలకు నానా అవస్థలు పడుతున్నారని, మొన్నటి మొంథా తుపాన్ వీరిని అల్లాడించిందన్నారు. ఈ నేపథ్యంలో తమకు కొండ దిగువన ఇళ్లస్థలాలు, ఇంటి నిర్మాణాలకు సహకరించాలని ఎన్నిసార్లు అధికారులకు మొరపెట్టుకోవడంతో పాటు దరఖాస్తులు అందజేసినా స్పందన లేదన్నారు. కొండశిఖర వాసుల కష్టాలు తెలియాలంటే జిల్లాకలెక్టర్, ఎంపిడిఒ, తహశీల్దార్, ఇతర అధికారులు ఒకసారి ఆయా గ్రామాల్లో రాత్రి బస చేయాలని గోవిందరావు డిమాండ్ చేశారు. ఇప్పటికైనా కొండశిఖర పివిటిజిల సమస్యలపై అధికారులు స్పందించాలని కోరారు. ఆదివాసి గిరిజన నాయకులు సేదరి రాజు, కొర్ర భీమరాజు పాల్గొన్నారు.

వన సమారాధన

వనసమారాధనలో పాల్గొన్న ఎమ్మెల్యే రాజు

ప్రజాశక్తి- రావికమతం: మండలంలో గొంప శివారు పల్లా వారి జంక్షన్‌లో గొంప తెలుగుయువత నాయకుడు పల్లా హరికృష్ణ మరియు వారి కుటుంబ సభ్యులు ఆధ్వర్యంలో సోమవారం వనసమారాధన నిర్వహించారు. చోడవరం ఎమ్మెల్యే కెఎస్ఎన్ఎస్ రాజు పాల్గొన్నారు. గత 20ఏళ్లగా గొంప కుటుంబీకులు, గ్రామంలో యువకులు, పెద్దలు, ప్రజలు ఐకమత్యంగా సహపంక్తి భోజనాలు చేయడం సంతోషకరమని ఎమ్మెల్యే అన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర కాపు కార్పొరేషన్ డైరెక్టర్ రాజాన కొండ నాయుడు, టిడిపి మండలఅధ్యక్షులు కోమటి శంకర్రావు, మత్స్య రాజు, గోకివాడ కోటేశ్వరరావు, బంటు శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

శివాలయాలు కిటకిట

నక్కపల్లిలో అన్న ప్రసాదానికి బారులుదీరిన భక్తులు

ప్రజాశక్తి - నక్కపల్లి :మండలంలోని ఉపమాక శివాలయంలో భక్తులు పోటెత్తారు. కార్తీక మాసం ఆఖరి సోమవారం పురస్కరించుకుని ఆలయ అర్చకులు మహేష్, సంతోష్ ఆధ్వర్యంలో పూజలు నిర్వహించి ,తీర్థ ప్రసాదాలను అందజేశారు. టిడిపి నాయకులు కొప్పిశెట్టి వెంకటేష్, గింజాల లక్ష్మణరావు, డి సత్యనారాయణ, నూకరాజు, పద్దు, కాశీ నాయుడు, వినోద్ రాజు, మాజీ ఎంపీపీ బొల్లం బాబ్జి, పలువురు నాయకులు, ప్రజాప్రతినిధులు, మండల పరిషత్ ఎఒ సీతారామరాజు, డిప్యూటీ ఎంపిడిఒ చలపతిరావు, పంచాయతీ కార్యదర్శి జయప్రకాష్ తదితరులు స్వామిని దర్శించుకున్నారు ఆలయం వద్ద భారీ అన్నసమారాధన నిర్వహించారు శ్రీనివాస భజన సమాజం ఆధ్వర్యంలో అర్ధ ఏకాహం భజన నిర్వహించారు.నక్కపల్లి పిఎసిఎస్ అధ్యక్షులు కొప్పిశెట్టి బుజ్జి, గ్రామ పెద్దలు, యువకులు భక్తులకు ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా ఏర్పాట్లను పర్యవేక్షించారు.

రేబాకలో ... మండలంలో రేబాక గూడుపమ్మతల్లి ఆలయ సన్నిధిలో కార్తీకమాసం 4వ సోమవారం సందర్భంగా సామూహిక కుంకుమ పూజలు ఘనంగా జరిగాయి. రేబాక, రేవెళ్ల, తిరుపతిపాలెం, రమణయ్యపేట, గుల్లిపాడు, ముకుందరాజుపేట, రమణయ్యపేట, జీ జగన్నాధపురం, పీఎన్ఆర్ పేట తదితర గ్రామాల నుంచి పెద్ద సంఖ్యలో మహిళా భక్తులు తరలివచ్చారు. **మాడుగుల:** కార్తీక మాసం నాల్గో సోమవారం సందర్భంగా మాడుగుల, ఒమ్మలి, ఒమ్మలి జగన్నాథపురం, ఎం. కృష్ణాపురం గ్రామాల్లో శివాలయాల్లో అన్నసమారాధనలు నిర్వహించారు. మాడుగులలో పార్థసారథి కొండపై అఖండ దీపారాధన నిర్వహించారు.భక్తులు పాల్గొన్నారు.

వడ్డాది : కార్తీక మాసం చివరి సోమవారం కావడంతో శివాలయాలు భక్తులతో రద్దీగా దర్శనమిచ్చాయి. భక్తులు శివుడికి భక్తి శ్రద్ధలతో పూజలు జరిపారు. ఉపవాస దీక్షలు చేశారు. వడ్డాదిలోని రామలింగేశ్వర స్వామి, భ్రమరాంబిక మల్లికార్జున స్వామి, కొత్తూరు పద్మ లింగేశ్వర స్వామి ఆలయాలు, దిబ్బిడి, విజయరామరాజుపేట, రాజాం, సీతయ్యపేట, పి.భీమవరం, బంగారు మెట్ట శివాలయాలలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. బంగారు మెట్టలోని కాశీ అన్నపూర్ణ విశ్వేశ్వర స్వామి ఆలయం వద్ద అన్న సమారాధన నిర్వహించారు. స్టేట్ హౌసింగ్ బోర్డ్ చైర్మన్ బత్తుల తాతయ్య బాబు, పాల్గొన్నారు.

అనకాపల్లి : కార్తీక మాసం నాలుగో సోమవారాన్ని పురస్కరించుకొని పట్టణంలో పలు దేవాలయాలకు భక్తులతో పోటెత్తారు. అనకాపల్లి సుంకరమెట్ట శ్రీసత్యనారాణస్వామి, శ్రీసూర్యనారాయణ స్వామి దేవస్థానం చైర్మన్ బొడ్డేడ మురళి ఆహ్వానం మేరకు రాష్ట్ర గవర కార్పొరేషన్ చైర్మన్ మళ్ల సురేంద్ర, కూటమి నాయకులు ద్వారపు రెడ్డి పరమేశ్వరరావు, కొణతాల వెంకటరావు, బొద్దపు ప్రసాద్, పోలవరపు త్రినాధ్, బొడ్డేడ శ్రీనివాసరావు స్వామివారి దర్శించుకున్నారు.

కాఫీ పండ్ల ధర పెంపు

ప్రజాశక్తి-చింతపల్లి : కాఫీ రైతులకు ఊరటనిచ్చేలా కాఫీ పండ్ల ధరలను పెంచుతూ సంబంధిత అధికారి, సంఘ ప్రతినిధులు నిర్ణయం తీసుకున్నారు. పాడేరు ఐటిడిఎ పిఒ తిరుమణి శ్రీపూజ, ఎపిఒ వెంకటేశ్వర్లు, కాఫీ ఎడి బొంజుబాబు సమక్షంలో కాఫీ యూనియన్ అధ్యక్షులు జనకని సింహాచలం, ఉపాధ్యక్షులు మర్రి వెంకట్రావు, కోశాధికారి మామిడి గోవిందరావు, మ్యాక్స్ సభ్యులు సమావేశమై ధరలను ఖరారు చేశారు. దీని ప్రకారం ఏ గ్రేడ్ కాఫీ పండ్లకు కిలోకు రూ.60, బీ గ్రేడ్ కాఫీ పండ్లకు రూ.55 చెల్లించనున్నారు. మార్కెటింగ్ పూర్తయిన తర్వాత బోనస్ రేటు నిర్ణయించి, రైతుల ఖాతాల్లో జమ చేసే విధానాన్ని కొనసాగించనున్నారు. గత సీజన్‌లో కాఫీ పండ్ల ధర కిలోకు రూ.44గా నిర్ణయించగా, రైతులకు మొదటి బోనస్‌గా రూ.8, రెండో బోనస్‌గా రూ.8 చెల్లించి మొత్తం రూ.60 రైతుల ఖాతాల్లో జమ చేసిన విషయం తెలిసిందే. కొత్త రేట్లతో ఈ సీజన్‌లో రైతులకు మరింత లాభం చేకూరే అవకాశముందని అధికారులు తెలిపారు.

బల్క్ డ్రగ్ పార్క్ రద్దుకు పోరాటం

మత్స్యకారుల వంటావార్పు నిరసన

రాజయ్యపేటలో నిరసన తెలుపుతున్న మత్స్యకారులు

ప్రజాశక్తి -నక్కపల్లి : బల్క్ డ్రగ్ పార్క్ రద్దు చేసే వరకు పోరాటాన్ని కొనసాగిస్తామని మత్స్యకారులు స్పష్టం చేసారు. మండలంలో రాజయ్యపేటలో బల్క్ డ్రగ్ పార్కును వ్యతిరేకిస్తూ మత్స్యకారులు తలపెట్టిన శాంతియుత రిలే దీక్షలు సోమవారం 65వ రోజుకు చేరింది. శిబిరం వద్ద మత్స్యకారులు వంటావార్పు నిరసన చేపట్టారు. తెలియజేశారు.బల్క్ డ్రగ్ ను వ్యతిరేకిస్తూ మత్స్యకారులు పెద్దపెట్టున నినాదాలు చేశారు. బల్క్ డ్రగ్ ఏర్పాటు చేస్తే తమ జీవితాలకు ముప్పు వాటిల్లుతుందని ఆవేదన వ్యక్తం చేసారు. సముద్రాన్ని నమ్ముకుని జీవనం సాగిస్తున్నామని, బల్క్ డ్రగ్ ఏర్పాటు చేసి తమ ఉనికిని దెబ్బతీయొద్దన్నారు. ఇప్పటికే తమ జీవితాలు సర్వనాశనం అయ్యాయని ఆవేదన వెలబుచ్చారు. తమ జీవన విధానాన్ని, ఉనికిని దృష్టిలో పెట్టుకొని ప్రభుత్వం బల్క్ డ్రగ్ ను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో పి పైడితల్లి,చొక్కా చిట్టమ్మ, ఎం.మహేష్‌బాబు,చేపల సోమేష్, వి.అప్పలరాజు, వై నాగేష్, చొక్కా కాశీ, కారే వెంకటేష్,కాశీ, గోసల సోమేశ్వర రావు, ఎం కాశీ, పి కోదండరావు, బి నూకరాజు పాల్గొన్నారు.

పాండవగిరిపై కోటి దీపోత్సవం

లక్ష దీపవ ఒత్తిని వెలిగిస్తున్న ఎమ్మెల్యే బండారు

ప్రజాశక్తి -మాడుగుల : కార్తీక మాసం నాల్గవ సోమవారం సందర్భంగా మాడుగుల పార్థసారథి గుడి వద్ద పాండవ గిరిపై కోటి దీపోత్సవం వైభవంగా నిర్వహించారు. స్థానిక ఎమ్మెల్యే బండారు సత్యనారాయణమూర్తి మెట్ల మార్గంలో తొలి మెట్టు వద్ద లక్ష దీపఒత్తిని వెలిగించి దీపోత్సవాన్ని ప్రారంభించారు. అనంతరం గోపూజ నిర్వహించి, కొండపై కోటిదీపాలు వెలిగించేందుకు కాగడతో బయలుదేరారు. వందలాది మంది మహిళలు మెట్లమార్గంలో దీపాలు వెలిగించి కార్యక్రమాన్ని విజయవంతం చేశారు. నన్నయ వర్సిటీ. మాజీ విసి ముర్రు ముత్యాలనాయుడు, ఎఎంసి చైర్మన్ అప్పలరాజు, భక్తులు పాల్గొన్నారు

విద్యార్థులకు కంటి పరీక్షలు

విద్యార్థులకు కంటి పరీక్షలు చేస్తున్న వైద్యురాలు పావని

ప్రజాశక్తి -నక్కపల్లి : మండలంలో గొడిచెర్ల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు సోమవారం నేత్ర పరీక్షలు చేశారు. గొడిచెర్ల పిహెచ్‌సి కంటి వైద్యాధికారి పావని విద్యార్థులకు కంటి పరీక్షలు చేశారు. 13 మందికి కళ్లద్దాలు అవసరమని గుర్తించి, వారికి ఉచితంగా అందిస్తామన్నారు. చిన్న వయసులో అంధత్వం రాకుండా తీసుకోవలసిన ఆహారం , ఇతర జాగ్రత్తలను విద్యార్థులకు వివరించారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు సంతోష్ కుమార్, ప్రత్యేక బోధన ఉపాధ్యాయురాలు షేక్ యాస్మీన్, పలువురు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

సిఐటియు అఖిల భారత మహాసభలను

జయప్రదం చేయండి

మాట్లాడుతున్న జగ్గునాయుడు

ప్రజాశక్తి -ములగాడ : సిఐటియు అఖిల భారత మహాసభలను జయప్రదం చేయాలని ఆల్ సైడ్ ముఠా కార్మిక సంఘం గౌరవాధ్యక్షులు ఎం.జగ్గునాయుడు పిలుపునిచ్చారు. ఆల్ సైడ్ ముఠా కార్మికుల జనరల్ బాడీ సమావేశం సోమవారం మారుతి జంక్షన్ జెపిఎల్ 2 సైడింగ్ వద్ద నిర్వహించారు. సంఘం అధ్యక్షులు పి.పైడిరాజు అధ్యక్షతన జరిగిన సమావేశంలో జగ్గునాయుడు మాట్లాడుతూ, సిఐటియు మహాసభలకు అన్ని రాష్ట్రాల నుండి 2000 మంది కార్మిక నేతలు విశాఖ నగరానికి వస్తున్నట్లు తెలిపారు. ఈ మహాసభలో దేశవ్యాప్తంగా అన్ని రంగాల కార్మికుల సమస్యలను, ఉద్యమాలు, పోరాటాలను సమీక్షించి, భవిష్యత్తు కర్తవ్యాలను రూపొందిస్తారని తెలిపారు. గొడౌన్స్ ఆల్ సైడింగ్‌లో పనిచేస్తున్న ముఠా కార్మికులకు సమగ్ర చట్టం చేయాలని, పోర్టు ప్రైవేటీకరణ ఆపాలని, పని ప్రదేశాల్లోనూ మౌలిక సదుపాయాలు ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. సిఐటియు మల్కాపురం జోన్ ప్రధాన కార్యదర్శి ఆర్.లక్ష్మణమూర్తి, జెపిఎల్ -1 న్యూ సైడింగ్ నాయకులు సిహెచ్.రాంబాబు, ఎస్.రామారావు, ఎమ్మెస్.రావు, జెపిఎల్- 2, 3 నాయకులు సింహాచలం, జిటి.నాయుడు, ఎస్.నాయుడు, ఈశ్వరరావు, జెపిఎల్-4 నాయకులు బలరాం, అప్పన్న పాల్గొన్నారు.

నర్సీపట్నం:వచ్చే నెల 31 నుంచి విశాఖలో తొలిసారిగా జరగనున్న సిఐటియు అఖిలభారత మహాసభలను జయప్రదం చేయాలని సిఐటియు నాయకులు ఈరెల్లి చిరంజీవి అన్నారు. సోమవారం నర్సీపట్నం ముఠా కార్మిక సంఘం ఆధ్వర్యంలో మహాసభల లోగోను ఆవిష్కరించారు. ఈసందర్భంగా మాట్లాడుతూ, జనవరి 4న విశాఖ ఆర్‌కె బీచ్ లో భారీ బహిరంగ సభకు కేరళ ముఖ్యమంత్రి పినరై విజయన్ రానున్నారన్నారు. సిఐఐ సదస్సుకు వచ్చిన ముఖ్యమంత్రి చంద్రబాబు స్టీల్‌ప్లాంట్ కార్మికులను ఉద్దేశించి. కూర్చోబెట్టి జీతాలు ఇవ్వాలా అంటూ మాట్లాడడం సరికాదన్నారు. కార్మికులను మోసం చేసిన యాజమాన్యాలు ఉంటాయి కానీ యాజమాన్యాన్ని కార్మికులు మోసం దేశంలో ఎక్కడా లేని విధంగా 8 గంటల పనిదినాన్ని 12 గంటలకు పెంచి కార్మికుల శ్రమను దోచుకోవాలని చూస్తున్నది చంద్రబాబు కాదాయని ప్రశ్నించారు. ఇప్పటికైనా కార్మిక వ్యతిరేక వైఖరిని చంద్రబాబు విడనాడాలని కోరారు. కార్యక్రమంలో ముఠా కార్మిక సంఘంజిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ కే.నానాజీ, జిల్లా ప్రెసిడెంట్ అప్పారావు, కోశాధికారి యం రమణ, సాంబ, రాము పాల్గొన్నారు

నర్సీపట్నంలో పోస్టర్ ఆవిష్కరణలో ముఠాకార్మికులు

శివాలయంలో

దాతలకు సత్కారం



దాతలను సత్కరిస్తున్న నాయకులు, నిర్వాహకులు

ప్రజాశక్తి- నక్కపల్లి : మండలంలోని ఉపమాక శివాలయంలో కార్తీక మాసం సందర్భంగా నాలుగు సోమవారాలు అన్నసమారాధనకు పెద్ద మొత్తంలో ఆర్థికంగాను, వస్తురూపాల్లో సహకరించిన దాతలు, సేవకులను సోమవారం ఘనంగా సత్కరించారు. నక్కపల్లి పిఎసిఎస్ అధ్యక్షులు కొప్పిశెట్టి బుజ్జి, గ్రామస్తుల పర్యవేక్షణలో హెటిరో యాజమాన్యం, భక్తులు, దాతలు, గ్రామస్తుల సహాయ సహకారంతో కార్తీక నాలుగు సోమవారాలు అన్న సమారాధన నిర్వహించారు.

సహకారం అందించిన హెటిరో కంపెనీ ప్రతినిధులు ఎం వి సుబ్బారెడ్డి, హేమ సుందర రాజు, కుల్లాయి రెడ్డి, సామాజిక కార్యకర్త నవర నూకరాజు శర్మ, గోకులపాటి బాబ్జిలతో పాటు పలువురు దాతలకు స్వామి మెమొంటో అందజేసి, శాలువాతో ఘనంగా సత్కరించారు. అలాగే ఆలయానికి విద్యుద్దీకరణ, పూల అలంకరణ చేపట్టిన దాతలను, ఏర్పాట్లను పర్యవేక్షించిన గ్రామపెద్దలు, యువకుల సేవలను కొనియాడారు.కార్యక్రమంలో వెంకన్న ఆలయ మాజీ చైర్మన్ కొప్పిశెట్టి కొండబాబు, సర్పంచ్ ప్రగడ వీరబాబు, కొప్పిశెట్టి శ్రీను, కోరుకొండ వరహాలరావు, ఎ నాగేశ్వరరావు, కె హరి, గోర్స శ్రీనివాస్, ఎన్ దిలీప్, వాసు, తోలేటి శ్రీనివాస్, శ్రీపాద ప్రసాద్, పొన్నాడ నారాయణరావు పాల్గొన్నారు.

డ్రగ్స్ రహిత సమాజాన్ని నెలకొల్పాలి

ప్రజాశక్తి-చోడవరం : డ్రగ్స్ రహిత సమాజాన్ని నెలకొల్పాల్సిన అవసరం ఉందని స్థానిక ఎమ్మెల్యే కేఎస్ఎన్ఎస్.రాజు, అనకాపల్లి డిఎస్‌పి శ్రావణి అన్నారు. పోలీస్ శాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న అభ్యుదయం సైకిల్ యాత్ర సోమవారం చోడవరం చేరిన సందర్భంగా నిర్వహించిన ర్యాలీ అనంతరం ప్రతిజ్ఞ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మాదక ద్రవ్యాలు వాడకం వలన ఎంతో మంది యువకులు తమ జీవితాలను నాశనం చేసుకోవడమే కాకుండా ప్రాణాలు కోల్పోతున్నారని తెలిపారు. వీటన్నిటినీ అరికట్టడానికి ప్రజల్లో చైతన్య తీసుకురావాల్సిన అవసరం ఉందన్నారు. ఈ కార్యక్రమం సీఐ అప్పలరాజు, ఎస్సైలు బంగారు రాజు, నాగ కార్తీక్, టిడిపి మండల అధ్యక్షుడు కనిశెట్టి సన్యాసిరావు, నాయకులు సకురు కోటేశ్వరరావు, విద్యార్థులు, పోలీసులు పాల్గొన్నారు.

ప్రతిజ్ఞ చేస్తున్న ఎమ్మెల్యే రాజు, డిఎస్‌పి శ్రావణి, పోలీసులు, నాయకులు

అనకాపల్లి రూరల్ : మాదక ద్రవ్యాల దుష్పరిణామాలపై ప్రజల్లో అవగాహన పెంపొందించడమే లక్ష్యంగా విశాఖపట్నం రేంజ్ పోలీస్ శాఖ ఆధ్వర్యంలో జరుగుతున్న అభ్యుదయం సైకిల్ యాత్ర సోమవారం మామిడి పాలెం చేరింది. గ్రామంలో పోలీస్‌లు విద్యార్థులతో కలిసి ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా రూరల్ సిఐ అశోక్ మాట్లాడుతూ మాదకద్రవ్యాల నివారణలో సమాజం మొత్తం బాధ్యతతో పాల్గొనాలని పిలుపునిచ్చారు. చోడవరం సిఐ అప్పలరాజు, రూరల్ ఎస్ఐ రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా బాలల దినోత్సవం

నెహ్రూ చిత్ర పటానికి నివాళులర్పిస్తున్న నాయకులు

ప్రజాశక్తి-మునగపాక : మండలంలోని గవర్ల అనకాపల్లి సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో అనకాపల్లి చిల్డ్రన్స్ క్లబ్, సుందరయ్య విజ్ఞాన కేంద్రం ఆధ్వర్యంలో సోమవారం బాలల దినోత్సవం, గ్రంథాలయ వారోత్సవాలు ఘనంగా జరిగాయి. ముందుగా గ్రంథాలయ నిర్వాహకులు ఆళ్ల మహేశ్వరరావు, అనకాపల్లి చిల్డ్రన్స్ క్లబ్ జిల్లా కన్వీనర్ బి.ఉమామహేశ్వరరావు, సిఐటియు జిల్లా అధ్యక్షులు వివి శ్రీనివాసరావు, కోశాధికారి గనిసెట్టి సత్యనారాయణ, ఆళ్ల సూరిబాబు, అప్పారావు, లక్ష్మి, వెంకటేశ్వర నాయక్ తదితరులు నెహ్రూ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. విద్యార్థులకు డ్రాయింగ్, వాలీ బాల్, సెటిల్ తదితర పోటీలను నిర్వహించారు. విద్యార్థులు వివిధ సాంస్కృతిక కళారూపాలను ప్రదర్శించారు. ఈ సందర్భంగా వక్తలు మాట్లాడుతూ నేటి భావి భారత పౌరులను శాస్త్రీయ దృక్పథం వైప మళ్లించడానికి ఇటువంటి కార్యక్రమాలు ఎంతో దోహదపడతాయని తెలిపారు. అనకాపల్లి చిల్డ్రన్స్ క్లబ్ ద్వారా నిర్వహించే ప్రతి కార్యక్రమంలో బాల, బాలికలు పాలుపంచుకొని విజ్ఞానం, వినోదం, శాస్త్రీయ దృక్పథం అలవర్చుకోవాలని పేర్కొన్నారు. ఈ సందర్భంగా వెంకటేశ్వర నాయక్ ప్రదర్శించిన మ్యాజిక్ షో పిల్లలను తల్లిదండ్రులు అలరించింది. అనంతరం వివిధ పోటీల్లో గెలుపొందిన విజేతలకు బహుమతులు, సర్టిఫికెట్లు ప్రదానం చేశారు.

విద్యార్థులు కెరీర్‌పై అవగాహన పెంచుకోవాలి

ప్రజాశక్తి-అనకాపల్లి : విద్యార్థులు తమ కెరీర్ పట్ల మంచి అవగాహన పెంచుకొని ప్రణాళికతో చదివితే మంచి ఉన్నత భవిష్యత్తు ఉంటుందని ఏఎంఏఎల్ కళాశాల పూర్వ కామర్స్ లెక్చరర్ డాక్టర్ వివేక్ రాజశేఖర్ అన్నారు. కళాశాలలో సోమవారం డాక్టర్ వివేక్ రాజశేఖర్ డిగ్రీ మొదటి సంవత్సరం విద్యార్థులకు కెరీర్ గైడెన్స్‌పై అవగాహనా సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ గల్లా జయబాబు మాట్లాడుతూ వివేక్ రాజశేఖర్ ఫెలో మెంబర్ కాస్ట్ అండ్ మేనేజ్మెంట్ అకౌంట్స్ ఆఫ్ ఇండియా డిపార్ట్మెంట్లో డైరెక్టర్‌గా రిటైర్ అయ్యారని, యూఎస్ఏ, ఫ్రాన్స్, ఆస్ట్రేలియా, స్పెయిన్ వంటి దేశాలలో పర్యటించటమే కాక విక్టరీ గ్రూప్ ఆఫ్ కంపెనీలు, డే స్ప్రింగ్ ఇండియా లిమిటెడ్, అమ్మా ఫస్ట్ ఎయిడ్ ఆస్ట్రేలియా వంటి సంస్థలకు బోర్డ్ మెంబర్‌గా పనిచేశారని తెలిపారు. ఈ కార్యక్రమంలో కామర్స్ విద్యార్థులు, అధ్యాపకులు పాల్గొన్నారు.

అక్రమ లేఅవుట్‌పై ఫిర్యాదు

ప్రజాశక్తి-కోటవురట్ల : మండలంలో సుంకపూరు గ్రామంలో అక్రమ లేఅవుట్‌పై జనసేన పార్టీ మండల అధ్యక్షులు సింగంపల్లి శ్రీనివాస్ సోమవారం పిజిఆర్‌ఎస్‌లో ఫిర్యాదు చేశారు. సుంకపూరు గ్రామంలోని ఎల్పీఎం నెంబర్ 1976లో 88 సెంట్లు చిటికెల సన్యాసమ్మ పేరుతో ఉన్న వ్యవసాయ భూమిలో ఎటువంటి అనుమతి లేకుండా లేవుట్ ఏర్పాటు చేసినట్లు ఆ ఫిర్యాదులో పేర్కొన్నారు.